ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఏలూరు
జిల్లా వార్తలు
3
గురువారం 2 మే 2024



మళ్లీ అవే ఇబ్బందులు..!

బ్యాంకుల్లో పింఛన్ సొమ్ము జమ నిర్ణయంపై సర్వత్రా మండిపాటు

- పింఛన్‌దారులను అవస్థలకు గురి చేసేలా వైసీపీ ప్రభుత్వ చర్యలు
- మంచంపై ఉన్న వయో వృద్ధులకు ఇంటి వద్ద అందని పెన్షన్
- సచివాలయ, ఇతర సిబ్బందితో ఇంటింటికి పంపిణీ చేయాలని లబ్ధిదారుల డిమాండ్

ఏలూరు రూరల్, మే 1 : సామాజిక పింఛన్ పంపిణీ విషయంలో వైసీపీ సర్కార్ మరో ఎత్తుగడకు తెరతీసింది. బ్యాంకుల్లో సొమ్ము జమ చేస్తామని ప్రకటించింది. ఎక్కడో దూరంగా ఉండే బ్యాంకుల వద్దకు వెళ్లి మండుటెండలో పింఛన్‌దారులు పడిగాపులు కాసేలా చేసింది. మొత్తంగా మళ్లీ పింఛన్‌దారులను ఇబ్బందులకు గురిచేసి ఆ నెపాన్ని విపక్షాలపై వేసేందుకు ప్రయత్నిస్తోందని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఈ నిర్ణయంపై లబ్ధిదారుల్లో అసంతృప్తి వ్యక్తమౌతోంది. గత నెల సచివాలయాల వద్ద పెన్షన్లు పంపిణీ చేస్తే లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈనెల బ్యాంక్ ఖాతాల్లో నగదు వేసే ప్రక్రియను ప్రభుత్వం చేపట్టడంతో పెన్షన్‌దారులు ప్రభుత్వ పనితీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇంటి వద్దకు వచ్చి పెన్షన్ ఇస్తామని చెప్పిన ఈ ప్రభుత్వం నూతన విధానాలను చేపట్టి లబ్ధిదారులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు. సచివాలయ, ఇతర సిబ్బంది ద్వారా ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ ఇస్తే నష్టం ఏమిటంటూ ధ్వజమెత్తుతున్నారు. బ్యాంకులకు వెళ్లలేని వారు ఉంటే వారి ఇళ్లకు వెళ్లి పింఛన్ ఇస్తామనడం వెనుక అసలు కారణాలు ఏమిటంటూ మండిపడుతున్నారు. ప్రస్తుతం పగటి ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలు నమోదవుతున్న నేపథ్యంలో దూరప్రాంతాల్లో ఉన్న బ్యాంకులకు పింఛన్‌దారులు వెళ్లి పింఛన్ తీసుకోవాలంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ విధానం వల్ల బ్యాంకుల్లో గంటల తరబడి పడిగాపులు పడాల్సి ఉంటుంది. మండుటెండలో వృద్ధులు బ్యాంకులకు వెళ్లగలరా..? క్యూలో నిలబడగలరా? విత్‌డ్రా ఫామ్‌లను పూర్తి చేయగలరా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పింఛన్‌దారులు అధిక సంఖ్యలో బ్యాంకుల వద్దకు వెళ్లడం వల్ల రద్దీ పెరుగుతుంది. వందల సంఖ్యలో వచ్చే వృద్ధులకు తగిన ఏర్పాట్లు చేసే పరిస్థితి బ్యాంకుల వద్ద లేదు. ఎండల్లో వృద్ధులకు ఏదైనా జరిగితే బాధ్యత ఎవరిది అనేది వాదన వినిపిస్తోంది. ఎండలను దృష్టిలో పెట్టుకుని ఇంటివద్దే పింఛన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



మండుటెండలో వృద్ధుల పాట్లు

పోలవరం : పోలవరం మండలంలో పెన్షన్ కోసం వృద్ధులు, దివ్యాంగులు బుధవారం సచివాలయాల వద్దకు మండుటెండలో కాలినడకన వెళ్లి అవస్థలకు గురయ్యారు. పెన్షన్ల సొమ్ములు బ్యాంకు ఖాతాలకు, పోస్టాఫీసు ఖాతాలకు జమ చేస్తామని, బ్యాంకు ఖాతాలు లేని వారికి నడవలేని వృద్ధులు, దివ్యాంగులకు సచివాలయాల సిబ్బంది స్వయంగా అందజేస్తారని, మిగిలిన వారు సచివాల యాల వద్దకు వెళ్లి తీసుకోవాలని మండల పరిషత్ అధికారులు సూచించారు. ఈ నేపథ్యంలో కొంతమంది వృద్ధులు, దివ్యాంగులు కొత్తనూతనగూడెం, కృష్ణారావుపేట గ్రామాల నుంచి మూడు కిలోమీటర్ల దూరం ప్రయాణించి పోల వరం సచివాలయం 1, 2 వద్దకు వచ్చారు. బ్యాంకు ఖాతా లకు వేస్తే మళ్లీ రెండు మూడు కిలోమీటర్ల దూరం ప్రయా ణించి అవసరాలకు సొమ్ములు డ్రా చేసుకోవాల్సిన పరిస్థి తులు వస్తాయని సచివాలయ సిబ్బందిని బతిమాలుకుని నగదు తీసుకున్నామని పలువురు వృద్ధులు తెలిపారు.

జమ కాని సొమ్ము

నిడమర్రు : మండలంలో దివ్యాంగులకు, 85 ఏళ్లు దాటిన కొందరు వృద్ధులకు సచివాలయ ఉద్యోగులు ఇంటింటి వెళ్లి పంపిణీ చేశారు. మండలంలో 6,387 సామాజిక పింఛన్లు ఉండగా 1,840 పింఛన్లను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. డీపీటీ ద్వారా 4,547 పింఛన్ల సొమ్ము ఆయా పింఛన్‌దారుల అకౌంట్‌లో జమవుతాయని అధికారులు తెలిపినా బుధవారం సాయంత్రం వరకు డీపీటీ ద్వారా ఖాతాలకు జమ కాలేదు.

ఐదు కిలోమీటర్లు రావాల్సిందే..

ముసునూరు : మండలంలో 8,053 మంది పెన్షన్‌దారులు ఉండగా 1,852 మందికి ఇంటివద్దే పెన్షన్ ఇవ్వాల్సి ఉంది. ముసునూరు, చెక్కపల్లి, గోపవరం, వేల్పుచర్ల గ్రామాల్లో మాత్రమే బ్యాంక్‌లు ఉన్నాయి. చుట్టుపక్కల గ్రామాల పెన్షన్ దారులు ఈ బ్యాంక్‌ల వద్దకు రావాలంటే మూడు నుంచి ఐదు కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి ఉంటుంది.

51,081 మందికి ఇంటివద్దనే పింఛన్ : పీడీ

ఏలూరుసిటీ, మే 1: జిల్లాలో డీబీటీ ద్వారా కవర్ చేయ బడని (బ్యాంకు ఖాతాలు లేని), దివ్యాంగులు, తీవ్ర వ్యాధులు కేటగిరి కింద గుర్తించిన 64,338కి బుధవారం 51,081 మందికి సచివాలయాల సిబ్బంది ద్వారా ఇంటివద్దనే పింఛన్ పంపిణీ చేసినట్టు డీఆర్‌డీఏ పీడీ విజయరాజు తెలిపారు.

వీరు బ్యాంకుకు వెళ్లేదెలా..



పెదగొన్నూరు కర్షక దళిత వాడలో, విశ్వనాద్రిపాలెంలోమంచానికే పరిమితమైన వయో వృద్ధులు వెంకమ్మ.. మారెమ్మ

ముదినేపల్లి : ఇంటి వద్దే పెన్షన్‌ను పొందే వారి జాబితాల్లో అర్హులైన పలువురు వృద్ధుల పేర్లు చోటు చేసుకోలేదు. మంచం మీదే లేచి కూర్చునే స్థితిలో లేని వృద్ధులు బ్యాంకులకు వెళ్లి పెన్షన్ ఎలా తీసుకోగలరో అర్థం కావడం లేదు. మండలంలో 2,250 మందికి ఇంటి వద్దే పెన్షన్లను అందజేయాలని గుర్తించి జాబితాలను రూపొందించారు. ఎన్నో ఏళ్లు గా తీవ్ర అనారోగ్యంతో మంచం మీదే ఉన్న పలువురు వృద్ధుల పేరు ఆ జాబితాల్లో చోటు చేసుకోలేదు. పెదగొన్నూరు శివారు కర్షక దళితవాడలో మద్దాల వెంకమ్మ (86) అనే వృద్ధురాలు పైకి లేవలేని స్థితిలో మంచం పైనే ఉంది. గత నెలలో ఇంటికి వెళ్లి పెన్షన్ ఇచ్చారు. కానీ బెడ్ రెడీన్ జాబితా లో ఆ వృద్ధురాలి పేరు చేర్చకపోవడంతో ఈ నెల పెన్షన్ బ్యాంక్ ఖాతాలో జమ కానుంది. ఆమె ఉన్న పరిస్థితిలో బ్యాంకుకు ఎలా వెళ్లగలదు. విశ్వనాద్రిపాలెం లో యెందూరి మారెమ్మ (82) అనే వృద్ధురాలు మంచానికే పరిమితమైంది. ఆమె పేరు బెడ్ రిడేన్ జాబితాలో లేదు. చాలా గ్రామాల్లో మంచం మీదే అనారోగ్యంతో ఉన్న వయో వృద్ధుల పెన్షన్ బ్యాంక్ ఖాతాల్లో జమ అయ్యే పరిస్థితి. బ్యాంకు ఖాతాల్లో పెన్షన్ సొమ్ము జమ అయితే తీసుకోవడం ఎలా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

హోం ఓటింగ్‌కు 914 మంది దరఖాస్తు

- రేపటి నుంచి 7వ తేదీ లోగా రెండు విడతలుగా క్షేత్రస్థాయిలో సిబ్బంది పర్యటన

ఏలూరు సిటీ, మే 1 : ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలనే లక్ష్యంతో 85 ఏళ్లు నిండి న వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశం (హోం ఓటింగ్) కల్పించిన విషయం తెలిసిందే. జిల్లా వ్యాప్తంగా 914 మంది దరఖాస్తు చేసుకున్నారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ తెలిపా రు. జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో 85 ఏళ్లు నిండిన ఓటర్లు 503 మంది, 40 శాతం వైకల్యం ఉన్న దివ్యాంగ ఓటర్లు 411 మంది ఉన్నారని తెలిపారు. వీరికి హోం ఓటింగ్ సౌకర్యం కల్పించేందుకు ఎన్నికల సిబ్బందితో కూడిన 55 బృందాలను కేటగిరీల వారీగా ఏర్పాటు చేశామన్నారు. వీరు ఆయా రూట్లలో ఆయా నియోజకవర్గాల్లో ఈనెల 3వ తేదీ నుంచి 7వ తేదీ లోగా రెండు విడతలుగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తారని పేర్కొన్నారు. ఆ మేరకు ఆయా ఓటర్లకు ముందస్తుగా సమాచారం ఇవ్వనున్నామని, వారు ఆ రోజుల్లో ఖచ్చితంగా ఓటుహక్కు వినియోగించుకోవాల్సి ఉంటుందన్నారు. కేట గిరీల వారీగా హోం ఓటింగ్ కోసం దరఖాస్తు చేసిన ఓటర్ల వివరాలివి.. ఉంగుటూరు నియోజకవర్గంలో 85 ఏళ్లు దాటినవారు 111, దివ్యాంగులు 123, దెందులూరులో 60 మంది, 32 మంది, ఏలూరులో 66 మంది, 48 మంది, పోలవరంలో 42 మంది, 50 మంది, చింతలపూడిలో 62 మంది, 58 మంది , నూజివీడులో 77, 32 మంది, కైకలూరు నియోజకవర్గంలో 85 ఏళ్లు దాటినవారు 85 మంది, దివ్యాంగులు 63 మంది ఉన్నారు.

1,50,731 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

ఏలూరుసిటీ, మే 1: జిల్లాలో ఇప్పటివరకు 1,50,731 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు జేసీ లావణ్యవేణి మంగళవారం వెల్లడించారు. జిల్లాలో నేటి వరకు 11,285 మంది రైతుల వద్ద నుంచి రూ. 291.42 కోట్లు విలువైన 1,50,731 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొను గోలు చేశామన్నారు. నేటి వరకు 21,441 మంది రైతులకు చెందిన 1,67,348 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నమోదు చేసుకున్నారన్నారు.



విభిన్న ప్రతిభావంతులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న చంటి

పేదల పక్షపాతి... తెలుగుదేశం పార్టీ

కూటమి ఏలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బడేటి చంటి

ఏలూరు టూటౌన్, మే 1: పేదల పక్షపాతిగా ఏ పార్టీ అయినా ఉందంటే అది ఒక్క తెలుగుదేశం పార్టీనే అని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఏలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య (చంటి) అన్నారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా 33వ డివిజన్ చిట్టివలసపాకల ప్రాంతంలో ప్రజా సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి మేనిఫెస్టో ప్రకటించిన తర్వాత వైసీపీ నోళ్ళు మూతపడ్డాయన్నారు. కూటమి మేనిఫెస్టో ముందు వైసీపీ మేనిఫెస్టో తెలిపోయిందన్నారు. పేదల సంక్షేమానికి తమ మేనిఫెస్టోలో అగ్రపీఠం వేశారన్నారు. వైసీపీ అరాచక పాలనను గద్దె దించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. భారీ మెజారిటీతో ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. ప్రజాసంకల్ప యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్న తీరు చూస్తుంటే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడడం ఖయమన్నారు. ఎంఆర్‌డీ బలరామ్, మనోజ్, కుసుమ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

అ అధికారులపై చర్యలు తీసుకోండి : లోకాయుక్త ఆదేశం

ఏలూరు టూటౌన్, మే 1 : ఏలూరు నగర పాలక సంస్థలో 2021లో అవుట్ సోర్సింగ్ ద్వారా 17 ఉద్యోగాలను భర్తీ చేశారు. అయితే నిబంధనలు పాటించకుండా, రిజర్వేషన్ల విధానం అమలు చేయకుండా ఉద్యో గాలు భర్తీ చేశారని, లక్షలాది రూపాయలు చేతులు మారినట్టు ఆరోపణలు వచ్చాయి. ఇదే విషయాన్ని కార్మిక నాయకుడైన జి.సునీల్‌కుమార్ లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. లోకాయుక్త విచారణలో అడ్డగోలుగా నియామకాలు చేపట్టారని స్పష్టం చేసింది. అప్పటి నగర పాలక సంస్థ కమిషనర్ చంద్రశేఖర్, పర్యవేక్షకులు షేక్ సిరాజుద్దీన్, కేఎస్ఎన్.మూర్తి, జూనియర్ అసిస్టెంట్ మాణిక్యాలరావులపై చర్యలు తీసుకోవాలని లోకాయుక్త మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీకి ఆదేశాలు జారీ చేసింది. నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగాలు భర్తీ చేయడంలో కొందరు వైసీపీ నాయకుల పాత్ర ఉందనే విమర్శలు వస్తున్నాయి.

మండే ఎండలో జగన్ మంటలు

- స్వోత్కర్ష.. పరనింద.. అన్ని సభల్లోనూ ఒకే తీరు
- ఈ మాత్రం దానికి ఇంత ఎండలో రావాలా ? అంటూ శ్రేణుల రుసరుస
- రోడ్డుపై సభతో.. బారికేడ్ల ఏర్పాటు.. షాపుల మూసివేత.. జనం పాట్లు



మాట్లాడుతున్న జగన్

ఏలూరులో మధ్యాహ్నం సీఎం సభ

ఎండతో మలమలమాడిన జనం

ఏలూరు/ఏలూరు రూరల్, మే 1(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'రోజూ చెప్పే మాటలే ఇక్కడా చెబుతున్నాడు. ఎండలో నిల బడి వినే బదులు ఇంటికి వెళ్లి టీవీ చూసుకోవచ్చు పద' అంటూ చాలా మంది సీఎం జగన్ సభ నుంచి తిరుగుముఖం పట్టారు. ఏలూరులో బుధవారం 36 నిమిషాలపాటు సాగిన సీఎం జగన్ ప్రసంగం ప్రజలను మెప్పించలేకపోయింది. 'సిద్ధమా ఏలూరు.. మధ్యాహ్నం ఎర్రటి ఎండలో కూడా మీ బిడ్డను ఆశీర్వదించటానికి ఇక్కడకు వచ్చిన మీకు అందరికి కృతజ్ఞతలు' అంటూ ప్రసంగం ప్రారంభం కాగానే చాలా మం ది మహిళలు, యువకులు సభాస్థలి నుంచి వెనక్కి వెళ్లడం ప్రారంభించారు. ఏలూరులో బుధవారం జరిగిన సీఎం జగన్ ప్రచార సభ అతి సామాన్యులను, వైసీపీ శ్రేణుల్లో నిరాశ మిగి ల్చింది. ఆయన రోజూ చెప్పే మాటలే ఇక్కడ చెప్పడం, ఉప న్యాసానికే పరిమి తమవడంతోపాటు ప్రభుత్వ విజయాలకంటే చంద్రబాబుపై విమర్శలకే అధిక సమయం తీసుకోవడంతో ప్రజలు, వైసీపీ శ్రేణులు పెదవి విరిచారు. సీఎం సభ కోసం ఎంపిక చేసిన ప్రాంతం ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. స్థానిక ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో ఏ రాజకీయ పార్టీ సభ జరిగినా నాలుగురోడ్ల కూడలిలో ఏర్పాటు చేయడం పరిపాటి. ఆ కూడ లి విశాలంగా ఉంటుంది. నాలుగు వైపుల వున్న ప్రజలు మాట్లాడేవారు కనిపిస్తూ అనుకూలంగా ఉండేది. అయితే బుధవారం అందుకు భిన్నంగా ఫైర్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో కోర్టు సెంటర్ రోడ్డులో ప్రసంగం చేయడంతో గంద రగోళం ఏర్పడింది. అలవాటు ప్రకారం చాలా మంది రోడ్డు మధ్యనే నిలబడిపోయారు. రోడ్డు డివైడర్‌కు ఒక వైపు పూర్తిగా సీఎం కాన్వాయ్ వాహనాలకు రిజర్వు చేయడంతో సభ ఏర్పా టు చేసిన రోడ్డుకు సగానికి కూడా జనం రాలేదు. ఫైర్ స్టేషన్‌కు కిలోమీటరు దూరంలోనే వాహనాలన్ని ఆపేయడంతో జనం విసుగు ప్రదర్శించారు. షాపులు మొత్తం మూయించ డంతో వారంతా ఆవేదనకు గురయ్యారు. ఫైర్‌స్టేషన్ నుంచి రాకపోకలు నిషేధించడంతో బస్సుల కోసం ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. పాతబస్టాండ్ వద్దే రెండు గంటలు నిలిపివేయడంతో బస్సులు లేక ప్రయాణికులు వేచి ఉన్నారు. ఎర్రటి ఎండలో తమను అనవసరంగా నడిపిస్తున్నారంటూ పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ ఏర్పాటుపై వైసీపీ శ్రేణులే అసహనం వ్యక్తం చేశారు. దీనికితోడు మధ్యాహ్నం విద్యుత్తు సరఫరా లేకపోవడంతో ఆ ప్రాంత వాసులు అల్లాడిపోయారు. ఇక ఏలూరు ఫైర్‌స్టేషన్ మీదుగా వెళ్లాల్సిన వాహనాల ఎప్పుడూ లేనివిధంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు దారి మళ్లించారు.



ఎండ వేడికి తట్టుకోలేక ఇలా పెట్రోలు బంకులో నీడకు చేరిన మహిళలు

ఆకట్టుకోని సీఎం ప్రసంగం

సీఎం జగన్ ప్రసంగం జనాన్ని మెప్పించలేకపోయింది. ఆయన మాట్లాడిన ప్రసంగం మొత్తం బటన్ నొక్కడం, వివిధ సంక్షేమ పథకాల పేర్లు పదేపదే వల్లి వేయటానికే సరిపెట్టా రు. కనీసం రాష్ట్రంలో ఫలానా అభివృద్ధి కార్యక్రమం చేశామని ఒక్కటి చెప్పలేదు. రాబోయే రోజుల్లో చేస్తామని చెప్పడానికి ఒక్క అభివృద్ధి పేరు తలచలేదు. ఎంతసేపు మీ బిడ్డ బిడ్డ అంటూ బటన్ నొక్కుడు పథకాలతోనే ప్రసంగాన్ని నింపివే శారు. అవకాశం దొరికినప్పుడల్లా చంద్రబాబును విమర్శించ టానికి ప్రయత్నించారు. జగన్ మాట్లాడుతూ వచ్చే రెండు వారాల్లో కురుక్షేత్ర సంగ్రామం మొదలవుతుందని, పేదలకు చంద్రబాబు మోసాలకు యుద్ధం ప్రారంభమైందన్నారు. చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా ఉండి రాష్ట్రానికి చేసిన అభివృద్ధి చెప్పుకోవడా నికి ఒక్కటైనా ఉందా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో క్లాస్‌వార్ జరుగుతోందన్నారు. టీడీపీ ఎన్నికల ప్రణాళిక నమ్మి మోస పోవద్దని, అది చంద్రబాబు అధికారంలోకి వస్తే ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలు ఆపేస్తాడన్నారు. వైసీపీ పథకాలు ఉండాలో వద్దో, అందాలో ప్రజలే నిర్ణయించు కోవాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆళ్ళ నాని, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ను ప్రజలకు పరిచయం చేసి గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు జనసమీకరణలో కూడా అనుకున్న స్థాయిలో ప్రయత్నాలు చేయలేదు.

రేపు సీఎం జగన్ నరసాపురం రాక

నరసాపురం : సీఎం జగన్ శుక్రవారం ఉదయం పది గంటలకు నరసాపురంలో ఎన్నికల ప్రచార సభ నిర్వహించనున్నారు. టేలర్ హైస్కూల్ మైదానంలో హెలికాప్టర్ దిగి అక్కడ నుంచి నేరుగా మెయిన్‌రోడ్‌కు చేరుకుని మాట్లాడతారు.

నిర్వాసితుల పుట్టెడు ఆశలు

- నిర్వాసితుల పక్షానే మహేష్ కుమార్ యాదవ్
- ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ నిధికి రూ.కోటి విరాళం
- మూడు దశాబ్దాల్లో ఇదే హైలెట్
- జనసేనతో కలిసి నిధికి అంకురార్పణ
- ముంపు మండలాల్లో హర్షాతిరేకాలు

ఏలూరు, మే1(ఆంధ్రజ్యోతి ప్రతినిధి):పోలవరం నిర్వాసితుల కుటుంబాల్లో ఎన్నికల వేళ పుట్టెడు ఆశలు. చీకట్లో చిరుదివ్వెలా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి నూతన కల. పైసా పైసా వేసుకుని నిర్వాసితులకు ప్యాకేజీ ఇచ్చి ఎందుకు ఆదుకోరాదంటూ జనసేన అధిపతి పవన్‌కళ్యాణ్ వేసిన ప్రశ్నకు ఏలూరు ఎంపీ కూటమి అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ స్పందించి రూ.కోటి విరాళం ప్రకటించి సంచలనం సృష్టించారు. ఈ నిర్ణయంపై పోలవరం ప్రాజె క్టు పరిసరాల్లో, ముంపు మండలాన్నింటిలోనూ హర్షాతి రేకాలు వ్యక్తమవు తున్నాయి. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు సహాయ, పునరావాస ప్యాకేజీ, భూమికి భూమి పథకం ఇంకా పూర్తిగా అమలు కాలేదు. ప్యాకేజీ నిమిత్తం ఇప్పటికే ముంపు మండలాల్లో నిర్వాసితులందరికీ రూ.30 వేల కోట్లుకు పైబడి పరిహారం చెల్లించాల్సి ఉంది. కేవలం హామీల మాదిరిగా కాకుండా వేలాది కుటుంబాలను ఆదుకోవడానికి, ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి పవన్ కళ్యాణ్ మదిలో సరికొత్త ఆలోచన వచ్చింది. కొయ్యలగూడెంలో మంగ ళవారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ నిమిత్తం నిర్వాసితులకు చెల్లించాల్సిన మొత్తాన్ని ప్రజలే విరాళాలుగా వేసుకుని ఓ నిధి ఏర్పాటు చేయాలన్నదే పవన్ ఆలోచన. అనుకున్నదే తడవుగా ప్రత్యేక నిధి ఏర్పాటు, దీనికి తన తొలి విరాళంగా కోటి రూపాయలను ప్రకటించారు.

నేనున్నానంటూ మహేష్ కుమార్ యాదవ్ కోటి విరాళం..

కూటమి అభ్యర్థిగా ఏలూరు లోక్‌సభ స్థానంలో బరిలో నిలిచిన పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ తన ప్రచారంలో సంచలన నిర్ణయాలు తీసుకుంటు న్నారు. కొయ్యలగూడెం సభలో జనసేనాధిపతితో పాటు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ నిమిత్తం తాను వ్యక్తిగతంగా కోటి విరాళాన్ని ప్రకటించారు. వాస్తవానికి ఈ ప్రకటన ప్రత్యర్థి పార్టీలకు షాక్ ఇచ్చింది. ఎంపీ అభ్యర్థి అయిన మహేష్‌పై నాన్ లోకల్ అంటూ వైసీపీతో సహా మరికొందరు బాణాలు ఎక్కు పెట్టారు. వీటన్నింటిని తిప్పికొడుతూనే నిర్వాహిత బాధిత కుటుంబాలకు వ్యక్తిగతం ఎవరూ చేయని విధంగా తొలిసారి కోటి విరాళం ప్రకటించడం రాజకీయ వర్గాల్లో ఎక్కడ లేని ఆసక్తి నింపింది. ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ గిరిజన, గిరిజనేతర కుటుంబాల్లోనూ ఈ నిర్ణయం ప్రత్యేకించి ఆలోచించేలా చేసింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని తాను తొలి ప్రాధాన్యతగా తీసుకుంటానని నిర్వాసిత కుటుంబాలను ఆదుకుంటానని, ముంపు మండలాల్లో మౌలిక సదుపాయాలు మరింత విస్తృతమయ్యేలా చూస్తానని గిరిజన, గిరిజనేతర కుటుంబాలకు తాను అండగా ఉంటానంటూ ఈ మధ్యనే కుక్కునూరులో జరిగిన భారీ ర్యాలీలో మహేష్ యాదవ్ ప్రకటించడమే కాకుండా దానికి తగ్గట్టుగా నిర్ణయాలు తీసుకున్నారనే ఆనందంలో గిరిజన కుటుంబాలు ఉన్నట్లు నిర్వాసిత గ్రామాల్లో భారీ ప్రచారం సాగుతోంది.

ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో పోలవరమే అసలు టార్గెట్

ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, ముంపు గ్రామాలు, పునరావాస కాలనీలు, ఉపాధి మౌలిక సదుపాయలు అంశాల చుట్టూనే ఎన్నికల వేడి సాగుతోంది. పోలవరం నియోజకవర్గంలో ఈ సమస్యలన్నీ అత్యధికంగా ఉండటంతో పోలవరం పూర్తి చేయాలంటే కూటమి అధికారంలోకి రావాలంటూ, దానికి మీ ఆశీర్వాదం కావాలంటూ చంద్రబాబు ఇప్పటికే పలు ప్రచార సభల్లో విజ్ఞప్తి చేస్తూనే వచ్చారు. అటు కాంగ్రెస్, ఇటు వైసీపీ పోలవరంను పఠిస్తున్నాయి. కానీ రాజకీయాల్లో కొత్తగా చొరవగా దూసుకొచ్చిన మహేష్‌యాదవ్ స్వతహాగా ఇంజనీరు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ఆయనకు కొంత అనుభవం ఉంది. అంతకంటే మించి అభ్యర్థిగా రంగంలోకి దిగారు కాబట్టి ఈ అవగాహనతోనే కుక్కునూరు, వేలేరుపాడు వంటి మండలాల్లోనూ ఆయన చేసిన పర్యటనలకు విశేష ఆదరణ లభిస్తోం ది. ఇప్పుడు నిర్వాసితుల పట్ల ప్రత్యేకంగా తీసుకున్న శ్రద్ధ కూటమికి మరింత కలిసొచ్చే అంశమైంది. పవన్‌కళ్యాణ్‌కు నిర్వాసిత కుటుంబాల్లో ప్రత్యేక ఆదరా భిమానాలు ఉన్నాయి. జనసేన అభ్యర్థి చిర్రి బాలరాజు పోలవరం నుంచే పోటీ చేస్తున్నారు. ఎంపీ అభ్యర్థి మహేష్ కుమార్ యాదవ్ విస్తృత ప్రచారం, కీలక నిర్ణయాలు, పునరావాస నిధికి కోటి విరాళం వంటి నిర్ణయాలు కూటమి అసెంబ్లీ అభ్యర్థులకు కలిసొచ్చే అంశంగా మారినట్టు ప్రచారం జరుగుతోంది. నాన్‌లోకల్ అంటూ తనను పదేపదే దెప్పిపొడుస్తున్న వైసీపీకి కోటి విరాళంతో గట్టి కౌంటర్ ఇచ్చినట్లేనని జనసేన విశ్లేషిస్తోంది. ముంపు మండలాల్లో పెట్రోల్ బంకు ఏర్పాటు, ఏలూరులో స్మార్ట్ సిటీ, నూజివీడులో మామిడి ఉత్పత్తులకు ఊతం, చింతలపూడి ఎత్తిపోతల పూర్తి, చిన్నతరహా పరిశ్రమలు వచ్చేలా, నిలదొక్కుకునేలా చూడటం, పామాయిల్, మొక్కజొన్న రైతులకు అండగా నిలుస్తామన్న ప్రచార హామీలన్నీ మహేష్‌తో పాటు ఏడు నియోజకవర్గాల పరిధిలోని కూటమి అభ్యర్థులకు కలిసొచ్చేదిగా ఉంది.



వైసీపీ పాలనలో వైద్యానికే రోగం!

ప్రతిపక్ష నాయకుడిగా పాలకొల్లు నియోజకవర్గంలో పాదయాత్రలో జగన్ ఘనమైన హామీలు ఇచ్చారు. సీఎంగా జగన్ పాలనలో వైద్యానికే రోగమొచ్చింది.! పాలకొల్లు ఏరియా ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఆస్పత్రి హామీకి మతిమరుపు రోగం. సీఎంగా పాలకొల్లులో ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మిస్తామన్నారు. వైద్య కళాశాలకు నిర్లక్ష్యం రోగం అంటుకుంది. ఐదేళ్లు గడిచిపోయాయి. అదే రోగాలతో నియోజకవర్గం వైద్యం కోసం ఎదురుచూస్తోంది. టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు ఉచితంగా అందిస్తామన్నారు. కనీస సౌకర్యాలు లేకుండా కొందరికి మాత్రమే ఇళ్లు అప్పగించారు. లబ్ధిదారులందరికీ రుణాలు అప్పగించారు. పట్టణ ప్రజల తాగునీటి అవసరాలకు గోదావరి జలాల తరలింపు హామీ గోదారిలో కొట్టుకుపోయింది. కొబ్బరికి గిట్టుబాటు ధర హామీ ఐదేళ్లుగా చెట్టెక్కి కూర్చుంది.

- పాలకొల్లు అర్బన్

జగన్మాయ


వైద్య కళాశాలకు కేటాయించిన స్థలం

- వైద్య కళాశాల నిర్మాణ పనులు చేపట్టలేదు
- ఏరియా ఆస్పత్రి వంద పడకల స్థాయికి పెరగలేదు
- పట్టణ ప్రజల దాహార్తికి గోదావరి జలాలు ఇవ్వలేదు
- కొబ్బరి రైతులకు గిట్టుబాటు ధర హామీ చెట్టెక్కింది
- టిడ్కో ఇళ్లు ఇవ్వలేదు.. రుణాలు అప్పగించారు

వైద్య కళాశాల ఎక్కడ జగనన్నా..



జిల్లాకో వైద్య కళాశాల అంటూ పాలకొల్లు సమీపంలోని దగ్గులూరులో కళాశాల ఏర్పాటు చేస్తున్నట్లు హడావుడి చేశారు. 60 ఎకరాల వ్యవసాయ భూమి సేకరించారు. సంబంధిత రైతులకు సొమ్ము చెల్లించడంలోనే ఏడాది జాప్యం చేశారు. భవనాల నిర్మాణానికి రూ.475 కోట్లు కేటాయించామన్నారు. కనీసం పనులు ప్రారంభించకుండానే పదవీ కాలం ముగిసింది. పట్టణంలో వంద పడకల ఆస్పత్రి హామీ అమలు చేయలేదు. తాగునీటికి గోదావరి జిల్లాలు తీసుకురాలేదు.

పాలకొల్లు నియోజకవర్గ అభివృద్ధిని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. నియోజకవర్గ కేంద్రమైన పాలకొల్లు పట్టణంలో డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కరించలేదు. శంభునిపేటలో అబ్దుల్ కలాం పార్కు, రామగుండం పార్కు, 27వ వార్డులో నిర్మాణంలో ఉన్న బీసీ కమ్యూనిటీ భవనం పూర్తి చేయలేదు. ఎన్‌టీఆర్, బివిరాజు కళాక్షేత్రం (ఓపెన్ ఎయిర్ థియేటర్), రహదారి బంగ్లా నిర్మాణం పూర్తి చేయలేదు. రూరల్ మండలం లంకలకోడేరు - వెలివెల రహదారిలో వంతెన నిర్మాణం పూర్తి చేయలేదు. లంకలకోడేరు నుంచి 27 గ్రామాలకు మంచి నీటి సరఫరా పథకాన్ని పూర్తి చేయలేదు. యలమంచిలి మండలంలో ఏటిగట్టు నిర్మాణం, డ్రెయిన్లపై అవుట్ ఫాల్ స్లూయిజ్‌ల నిర్మాణం, కుదేలైన ఆక్వా రంగానికి ప్రోత్సాహకాలను నిర్లక్ష్యం చేశారు. పోడూరు మండలం వద్దిపర్రులో నక్కల డ్రెయిన్‌కు సైడ్ వాల్స్ నిర్మాణం చేపట్టలేదు. పంట పొలాలు వరదల సమయంలో నీట మునుగుతున్నాయి. జిన్నూరు వంతెన నిర్మాణం పూర్తయినా అప్రోచ్ నిర్మాణం కాకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

పడకేసిన వంద పడకల ఆస్పత్రి

వంద పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయలేదు. భవన నిర్మాణాలు అరకొరగానే జరిగాయి. పూర్తిస్థాయిలో సిబ్బంది లేక వైద్య సేవలందకపోవడంతో రోగులు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి వేలాది రూపాయలు వెచ్చించవలసి వస్తోంది. వంద పడకల ఆసుపత్రి నిర్మాణం కాకపోవడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలకు తీవ్ర నిరాశ మిగిలింది.

నెరవేరని హామీలు

- ప్రతిపక్ష నాయకుడిగా గత ఎన్నికల ముందు పాదయాత్రగా ప్రజల ముందుకు వచ్చిన జగన్ హామీలు గుప్పించారు. అధికారంలో వచ్చిన తర్వాత ఒక్క హామీ కూడా అమలు చేయలేదు.
- వైసీపీ అధికారంలోకి రాగానే లబ్ధిదారులకు టిడ్కో గృహాలను ఉచితంగా ఇస్తామన్నారు. అందరినీ రుణాల్లో ముంచారు.
- కొబ్బరికి మద్దతు ధర ప్రకటించి రైతులకు అండగా ఉంటామని హామీలతో మురిపించి వదిలేశారు.
- పట్టణంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం గాలికొదిలేశారు.
- దమ్మయ్యపర్తి డ్రెయినేజీ పూర్తిస్థాయిలో నిర్మించి సమస్య పరిష్కరిస్తామన్నారు. తర్వాత పట్టించుకోలేదు.
- పాలకొల్లు పట్టణంలో ప్రధాన సమస్యల డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తామన్నారు. ఐదేళ్లుగా సమస్య అలాగే ఉంది.
- పాలకొల్లు ప్రజల తాగునీటి సమస్య తీర్చడానికి విజ్జేశ్వరం నుంచి పైపులైన్ ద్వారా మంచినీరు సరఫరా హామీ అమలు చేయలేదు.

టిడ్కో లబ్ధిదారులకు రుణాల మోసం




టీడీపీ ప్రభుత్వం 90 శాతం పూర్తి చేసిన టిడ్కో గృహాలను కేటాయించడంలో లబ్ధిదారులను వైసీపీ ప్రభుత్వం మోసం చేసింది. పట్టణంలో టీడీపీ ప్రభుత్వం సుమారు 7 వేల గృహాలు నిర్మించగా వాటికి వైసీపీ రంగులు వేసుకోవడం తప్ప చేసింది శూన్యం. 2 వేల ఇళ్లను అరకొర సౌకర్యాలతో లబ్ధిదారులకు స్వాధీనం చేశారు. తర్వాత మరో 1800 మందికి అందజేశారు. మిగిలిన ఇళ్లను అందజేయకపోగా రుణం చెల్లించాలని బ్యాంకుల నుంచి నోటీసులు రావడంతో లబ్ధిదారులు అవాక్కయ్యారు. ప్రభుత్వం రుణం తీసుకుని తమను మోసం చేసిందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లను స్వాధీనం చేయకుండా రుణాలు ఏవిధంగా చెల్లించాలని, ఉచితంగా అందిస్తానని జగన్ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నిస్తున్నారు.

కొబ్బరి గిట్టుబాటు చెట్టెక్కింది



కొబ్బరి పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామంటూ గత ఎన్నికల ముందు జగన్ హామీ ఇచ్చారు. కేరళలో ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్‌లు నెలకొల్పారు. కొబ్బరి వ్యర్థాలతో ఎరువులు తయారు చేస్తున్నారు. ఇక్కడ మాత్రం ప్రభుత్వపరంగా ఎటువంటి సహకారం లేదు. కొబ్బరికి సరైన ధర లేదు. ప్రభుత్వ ప్రోత్సాహం లేదు. ఉత్పత్తి కూడా తగ్గిపోయింది. కొబ్బరి ఆధారిత పరిశ్రమలకు చేయూతనిస్తామంటూ చెప్పుకొచ్చిన జగన్‌మోహన్ రెడ్డి ఆచరణలో తుస్సుమనిపించారు. ఒకప్పుడు జిల్లాలో కొబ్బరి మంచి ప్రసిద్ధిగా ఉండేది. ఇక్కడ నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు గణనీయంగా ఎగుమతి అయ్యేవి. ఇటీవల కాలంలో కొబ్బరి తోటలను రైతులు తొలగించేస్తున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో కొబ్బరి రైతు నీరుగారిపోతునాడు.

పునాది రాయి పడని వైద్య కళాశాల



పాలకొల్లు రూరల్ మండలం దగ్గులూరు వద్ద మెడికల్ కళాశాల పనులు జరుగుతున్నాయంటూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఏడాదిన్నర క్రితం నర్సాపురం సభలో ప్రకటించారు. వాస్తవానికి ఇప్పటికీ పునాది రాయి పడలేదు. వైద్య కళాశాల నిర్మాణం నిమిత్తం దగ్గులూరు వద్ద 63 ఎకరాలను సేకరించారు. ఏడాది వరకు సంబంధిత రైతులకు సొమ్ము చెల్లించలేదు. నిర్మాణ ఏజెన్సీ ఖరారు చేయడంలో జాప్యం చేశారు. కళాశాల నిర్మాణం కోసం రూ.475 కోట్లు కేటాయించారు. తర్వాత మెగా ఏజెన్సీకి పనులు అప్పగించినట్లు చెప్పిన పనులు ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదు. కనీసం స్థలం పూడిక కూడా చేయలేదు. ప్రభుత్వం వద్ద నిధులు లేకపోవడం వల్లే కళాశాల నిర్మాణంలో జాప్యం జరుగుతోంది.


పోలవరంలో మధ్యలో ప్రచారం ఆపిన అభ్యర్థులు

ఎండ దెబ్బకు మహిళా అభ్యర్థికి అస్వస్థత

ఏలూరు ఎంపీ, పోలవరం అసెంబ్లీ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ తరఫున ఇద్దరూ మహిళా అభ్యర్థులే పోటీలో ఉన్నారు. ఎంపీ అభ్యర్థి కావూరు లావణ్య, ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వెల సృజనతో పాటు పార్టీ మండల అధ్యక్షురాలు ముచ్చిక సీత బుధవారం పోలవరంలో ప్రచార కార్యక్రమం చేపట్టారు. పాత పోలవరం నుంచి మధ్యాహ్నం ఎండలో తిరుగుతున్నారు. ఎండ తీవ్రతకు ఎంపీ అభ్యర్థి లావణ్య ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యారు. వెంటనే కార్యకర్తలు, నేతలు స్పందించి చల్లటి నీరందించి సపర్యలు చేయడంతో కోలుకున్నారు. ఎండ తీవ్రత ఎక్కువ కావడంతో ప్రచారం మధ్యలో ముగించి వెనుదిరిగారు. - పోలవరం

ఈవీఎంల రెండో దశ ర్యాండమైజేషన్

ఏలూరు సిటీ, మే 1: ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా రెండో దశ ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేశ్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం ఎన్నికల సాధారణ పరిశీలకులు కృష్ణకాంత్ పాఠక్ సమక్షంలో నిర్వహించిన రెండోదశ ఈవీఎం యంత్రాల ర్యాండమైజేషన్ ప్రక్రియకు పలువురు అభ్యర్థులు, వారి ప్రతినిధులు హాజరయ్యారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిలో ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తయింది. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఒక అనుబంధ పోలింగ్ స్టేషన్‌తో కలిపి 1,744 పోలింగ్ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. నూజివీడు నియోజకవర్గంలో 286, పోలవరం- 284, చింతలపూడి- 273, దెందులూరు- 239, కైకలూరు - 235, ఉంగుటూరు- 214, ఏలూరు నియోజకవర్గంలో 213 పోలింగ్ కేంద్రాల వారీగా ఆన్‌లైన్ ద్వారా ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియతో కేటాయించారు. డీఆర్వో పుష్పమణి, నోడల్ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా ఎన్ఐసీ అధికారి శర్మ తదితరులు పాల్గొన్నారు.



లెక్క చెప్పాల్సిందే..!

అభ్యర్థుల ఎన్నికల ఖర్చుకు పరిమితి

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ ఖర్చులు తక్కువ చేసి చూపుతామంటే కుదరదు. ప్రస్తుత ధరలను బట్టి ఎన్నికల కమిషన్ దేనికి ఎంత వ్యయం అవుతుందో ఓ లెక్క సిద్ధం చేసింది. ఈ లెక్క ప్రకారం అభ్యర్థులు తమ ఖర్చులను సమర్పించాల్సి ఉంటుంది. ఎన్నికల ప్రచారం అంటే ఖర్చుతో కూడుకున్న వ్యవహారం అభ్యర్థుల వెంట అనుచరులు వస్తారు. ప్రచారానికి వెళ్లడానికి వాహనం, అనుచరుల భోజన సదుపాయాలు చేయాల్సిందే. మరోవైపు సభలు, ర్యాలీలు చేస్తే మరింత వ్యయం వాటికి సంబంధించిన లెక్కలను ఈసీకి అభ్యర్థులు చూపాల్సి ఉంటుంది. వాటర్ ప్యాకెట్ నుంచి, టిఫిన్, బిర్యానీ ఎక్కిన వాహనం, పెట్టిన మైకు, కట్టిన బ్యానర్, ఎగిరిన జెండాకు లెక్కలను పక్కాగా ఈసీకి చూపించాల్సిందే. అభ్యర్థుల వ్యయ పరిశీలనకు మండల నియోజకవర్గ స్థాయిలో ఈసీ పరిశీలకులను నియమించింది.

అభ్యర్థుల వ్యయ పరిమితి

ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులను కేంద్ర ఎన్నికల సంఘం వ్యయ పరిమితి విధించింది. ప్రస్తుత ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి గరిష్ఠంగా రూ.90 లక్షలు ఖర్చు చేసుకోవచ్చు. ఎమ్మెల్యే అభ్యర్థి గరిష్ఠంగా 40 లక్షలు వ్యయం చేసుకోవచ్చు. ఎన్నికల్లో ఈసీ సూచించిన పరిమితి కంటే ఎక్కువ అభ్యర్థులు ఖర్చు చేస్తారనేది బహిరంగ రహస్యం. ఈసీకి లెక్కలు మాత్రం పరిమితి కంటే కనీసం ఐదు ఆరు లక్షల రూపాయలు తక్కువగానే చూపిస్తారు. ఎన్నికలు లెక్కలు రాయడంలో ప్రతి నియోజకవర్గంలో ఆరితేరిన చిత్రగుప్తులు ఇందుకు ప్రత్యేకంగా ఉన్నారు. వారి ద్వారానే అభ్యర్థులు ఈసీ లెక్కలు రాయిస్తారు.

ఇలా ఖర్చు చేయాలి..

కోలాటానికి రూ5 వేలు, డ్రమ్స్ లేదా బ్యాండ్ రూ.వెయ్యి, లైట్స్ రోజుకు రూ. 300, 8 అడుగుల జెండా రూ.1500, వీడియో గ్రాఫర్‌కు రూ.5 వేలు, పువ్వులకు రూ.350, సౌండ్ బాక్స్‌లకు రూ.2 వేలు, పూల బోకేకు రూ.500, కరపత్రాలు వందకు రూ.600, బిస్కెట్ ప్యాకెట్‌కు రూ.40, విజిటేరియన్ భోజనం రూ.100, నాన్‌వెజ్ భోజనం లేదా బిర్యానీ రూ.150, పూరీ రూ.40, టీ రూ.10, బస్సుకు రూ.20 వేలు, వివిధ వాహనాలకు వివిధ రేట్లు ఉన్నాయి. డ్రైవర్‌కు రోజు భత్యం రూ.520, ఇలా ప్రతి దానికి ఈసీకి ఒక లెక్క ఉంది. దానిని బట్టి ఖర్చులు సమర్పించాల్సి ఉంటుంది. - అత్తిలి


ఎన్నికల వ్యయంపై సమీక్షిస్తున్న పరిశీలకుడు అగర్వాల్, ఆర్డీవో అంబరీష్

ఎన్నికల వ్యయ నిబంధనలు పాటించాలి


నరసాపురం, మే 1: సాధారణ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ఎన్నికల నియమావళికి అనుగుణంగా ఖర్చుల నిబంధనలు పాటించాలని ఎన్నికల పరిశీలకులు మోహన్‌లాల్ అగర్వాల్ సూచించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పర్యవేక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. నరసాపురం, పాలకొల్లు, ఆచంట నియోజవర్గాలకు సంబంధించిన అసెంబ్లీ అభ్యర్థులు వ్యయ పరిశీలనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో నగదు బట్వాడా, బహుమతులు, మద్యం తరలింపు తదితర అంశాలపై పర్యవేక్షణ ఉండాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో నరసాపురం ఆర్డీవో ఎం.అచ్యుత్ అంబరీష్, నియోజకవర్గ వ్యయ పరిశీలకులు పాల్గొన్నారు.

ఉండమ్మా బొట్టు పెడతా..!



శుభకార్యాలకు మహిళలకు బొట్టు పెట్టి ఆహ్వానించడం ఆనవాయితీ. ఇప్పుడది ఎన్నికల ప్రచారానికి పాకింది. అభ్యర్థుల తరఫున మహిళలు, వారి కుటుంబ సభ్యులు ప్రచారానికి ఇంటింటికీ వెళ్లి గృహిణుల నుదుట కుంకుమ బొట్టు పెట్టి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. కుంకుమ బొట్టు పెట్టి మహిళా ఓటర్లను సెంటిమెంట్‌తో ఓటు అడుగుతున్నారు.. ఈ ఎన్నికల్లో ఓ అడుగు ముందుకేసి కంఠానికి గంధం కూడ రాస్తున్నారు. ఒట్టి చేత్తో ఓటు అడిగితే ఏం బాగుంటుందని అనుకుంటున్నారో ఏమో గానీ ఓ బొట్టు పెట్టి బ్యాలెట్ నమూనా పేపర్ మహిళల చేతిలో పెడుతున్నారు. - ముదినేపల్లి

మహిళలకు తాయిలాలు



ఎన్నికలలో మహిళలకు తాయిలాల ఆశ చూపుతున్నారు. ఎన్నికల కోడ్ ముందు ఒక నియోజకవర్గంలో డ్వాక్రా మహిళలకు అధికార పార్టీ వారు చీరలు అందించారు. ఇప్పుడు మరొక నియోజకవర్గంలో డ్వాక్రా గ్రూపుల లోని మహిళలకు రూ.వెయ్యి, డ్వాక్రా గ్రూపులన్నింటికి కలిపి గ్రామాలలో ఉండే లీడర్ లకు రూ.25 వేలు తాయిలాలు అందిస్తున్నారు. ఎన్నికలతో మహిళల పంట పండినట్లే. పార్టీలు మహిళలకే ప్రాధాన్యం ఇవ్వడంతో ముందుగా పోటీ అభ్యర్థులు మహిళల ఓటర్లపైనే ఆకర్షితులుగా నిలుస్తున్నారనిపిస్తుంది. ఈ లెక్కన నియోజకవర్గంలో లెక్క వేస్తే కోట్ల రూపాయలు మహిళలకు తాయి లాలుగా ముట్ట చెబుతారేమో..? - భీమవరం రూరల్

షరుకు లేదా..?

మందుబాబుల చిర్రు బుర్రు



ఎన్నికల సంఘం నిబంధనలు మందు బాబులకు నిరాశ కలిగిస్తున్నాయి. కావల్సినంత మద్యం అందక ఉసూరుమంటున్నారు. రోజు వారీ అమ్మకాల లక్ష్యం పూర్తయితే ఏ సమయంలోనైనా ప్రభుత్వ మద్యం దుకాణాలను మూసేయొచ్చు. ఒక్కోసారి మద్యం దుకాణం ఆ రోజు మధ్యాహ్నానికే మూతపడుతోంది. ఆ సమయానికి వచ్చిన మందు బాబులు మద్యం దొరక్క ఊగిపోతున్నారు. దగ్గరలోని బెల్టుషాపులను ఆశ్రయిస్తున్నారు. తనిఖీలకు భయపడి బెల్టుషాపుల్లో కూడ మద్యం కొరత ఏర్పడడంతో మందుబాబులు చిర్రెత్తి పోతున్నారు. ఒక వేళ మందు ఉన్నా క్వార్టర్ బాటిల్‌కు రూ.30 అదనంగా వసూలు చేస్తున్నారు. - ముదినేపల్లి

మన సంగతేంటి.?



ఎన్నికల్లో విజయావకాశాలను బేరీజు వేసుకుంటూ అభ్యర్థులు, నాయకులు టెన్షన్‌తో సతమతమవుతున్నారు. ఈసారి ఓటుకు రేటెంత పలుకుతుందని, మన సంగతేంటని పలువురు తాపీగా రచ్చబండ చర్చలు సాగిస్తున్నారు. పార్టీలు, అభ్యర్థులు పోటా పోటీ తలపడుతుండడంతో కొంతమంది ఓటర్లు ఈసారి సొమ్ములు గట్టిగానే అందుతాయని ఎదురుచూస్తున్నారు. గత ఎన్నికల కంటే ఎక్కువే వస్తాయిలే కంగారు పడొద్దంటూ కబుర్లు చెబుతున్నారు. దానికి కూడ కొంతమంది ఓ లెక్క చెబుతున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులకు గెలుపు ఈసారి ప్రతిష్ఠాత్మకం. పోటా పోటీగా డబ్బులు పంచి పెడతార్రా అనుకుంటున్నారు. ఓటుకు నోటు అలవాటు చేశారు కదా తప్పదు మరి..! - ముదినేపల్లి

తండ్రి కోసం.. తనయ ప్రచారం



తండ్రి విజయం సాధించాలని తనయ ప్రచారం సాగిస్తోంది. ఉండి మండలం పాందువ్వలో కూటమి అభ్యర్థి కనుమూరు రఘురామకృష్ణరాజు కుమార్తె ఇందిరా ప్రియదర్శిని తన తండ్రిని గెలిపించాలని కోరారు. ముందుగా గ్రామంలో కొండాలమ్మను దర్శించుకున్నారు. - ఉండి

ఓటు.. మూడు కిలో మీటర్ల దూరం


కుక్కునూరు మండలంలో ఆదివాసీ గ్రామం

కుక్కునూరు మండలంలోని మారుమూల అటవీ ప్రాంతానికి చత్తీస్‌ఘడ్, ఒడిశా ప్రాంతాల నుంచి దాదాపు 20 ఏళ్ల క్రితం వేలాది మంది ఆదివాసీలు తరలివచ్చారు. వారిలో ఇటీవల దాదాపు 1500 మంది ఆదివాసీలకు కొత్తగా ఓటు హక్కు కల్పించారు. వారంతా ఓటు వేయాలంటే మారుమూల గ్రామాల నుంచి 3 నుంచి 5 కిలోమీటర్లు నడవాల్సిందే. రవాణా సౌకర్యం లేకపోవడంతో అటవీ మార్గంలో నడకే శరణ్యం. పలు పార్టీల నాయకులు ఆదివాసీలను కలసి ఓటు అభ్యర్థించారు. దాదాపు 1500 ఓట్లు ఉండడంతో వామపక్షాలతో పాటు ప్రధాన పార్టీలు కూడా ఆదివాసీల ఓట్లపై గురిపెట్టాయి. మౌలిక సదుపాయంతో పాటు పోడు భూములకు పట్టాలు కూడా కల్పిస్తామని ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల తరుపు హామీ ఇస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఆదివాసీలంతా మారుమూల ప్రాంతానికి వచ్చి నివాసం ఉంటున్నప్పటికీ ఆ గ్రామాల్లోనే వారంతా మగ్గిపోతున్నారు. కొన్నేళ్లుగా వారికి ప్రభుత్వాలు రేషన్‌కార్డు, ఓటు హక్కు కల్పించాయి. అటవీ ప్రాంతంలో కురుములతోగు గిరిజనులు రెండు కిలో మీటర్ల నడిచి దామరచర్లకు, చీపురుచెలక ఆదివాసీలు ఉప్పేరు గ్రామానికి, రేగులచెరువు ఆదివాసీలు అమరవరం గ్రామానికి, గుట్టపుతోగు ఆదివాసీలు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న బంజరగూడెం గ్రామానికి, రామాపురం ఆదివాసీలు బంజరగూడెం, లచ్చపేట ఆదివాసీలు అరవైపల్లికి, తెల్లరాయిగూడెం ఆదివాసీలు కివ్వాక గ్రామానికి కాలినడకన వెళ్లి ఓటు వేయాల్సిందే. - కుక్కునూరు



రాష్ట్రంలోనే ఏలూరుకు ప్రాధాన్యం ఉంది. చారిత్రాత్మకంగా, పారిశ్రామి కంగా, విద్యాపరంగా, పర్యాటకంగా ఏలూరు అభివృద్ధి చెందింది. స్వాతంత్ర్య సమరయోధుల గడ్డగా ఏలూరు ప్రసిద్ధి. చుట్టూ ఏరులున్న ఊరు కావడంతో ఆనాడు ఏలూరు అనే నామకరణం చేశారని చరిత్ర చెబుతోంది. ఏలూరును హేలాపురి నగరంగా పిలుస్తారు. కృష్ణా జిల్లాలోని కొన్ని తాలూకాలను, గోదావరి జిల్లాలోని పోలవరం తాలూకాను కలిపి ఆనాడు పశ్చిమ గోదావరి జిల్లాగా ఏర్పాటు చేయాలని 1925 ఏప్రిల్ 15వ ప్రభుత్వం ఉత్త ర్వులు జారీ చేసింది.ఆ జిల్లాకు కేంద్రంగా ఏలూరును నిర్ణయించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కేంద్రంగా ఏలూరు విలసిల్లింది. ఇటీవల కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా ఏలూరు కేంద్రంగా ఏలూరు జిల్లాను ఏర్పాటు చేశారు. - ఏలూరు సిటీ

సమరయోధుల గడ్డ

నాటి హేలాపురి.. నేటి ఏలూరు
పారిశ్రామికంగా, విద్యాపరంగా అభివృద్ధి
మహాత్మాగాంధీ నడయాడిన ప్రదేశం
టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీకి కంచుకోట
నేటికీ దర్శనమిస్తున్న బ్రిటిష్ కట్టడాలు

ఫ్లాష్ బ్యాక్


ఏలూరు వ్యూ..

ఏలూరు నగరానికి ఒకపక్క పల్లపు ప్రాంతాలుగా కొల్లేరు, కైకలూరు, మరో పక్క మెరక ప్రాంతాలుగా చింతలపూడి, జంగారెడ్డిగూడెం ఉన్నందున ఇక్కడ నిత్య జీవితంలో రెండు ప్రాంతాల ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. చింతలపూడి నుంచి వచ్చే తమ్మిలేరు వాగు ఏలూరు చివర అశోక్‌నగర్ వద్ద రెండుగా చీలుతుంది. ఎడమవైపు చీలిన వాగు తంగెళ్ళమూడి మీదుగా ప్రవహిస్తూ నగరానికి ఒక వైపు సరిహద్దుగా వుంది. తమ్మిలేరు కాలువకు ఆవల ప్రాంతాన్ని వన్‌టౌన్ అని, ఇవతల వున్న ప్రాంతాన్ని టూటౌన్ అని పిలుస్తారు.

విద్యాపరంగా అభివృద్ధి

ఏలూరు విద్యాపరంగా అభివృద్ధి సాధించింది. ఇక్కడ ప్రధానంగా మహాత్మాగాంధీ ప్రారంభించిన గాంధీ ఆంధ్రజాతీయ మహా విద్యాలయంతో పాటు సర్ సీఆర్‌ఆర్ విద్యాసంస్థలు, సెయింట్ థెరిస్సా విద్యాసంస్థలు ఎంతో పేరు ప్రఖ్యాతులు సాధించాయి. 1945లో సర్ కట్టమంచి రామలింగారెడ్డి పేరున సీఆర్‌ఆర్ కళాశాల ఏర్పాటు అయింది. ఆ తరువాత ఆశ్రం మెడికల్ కళాశాల ఏర్పాటు కాగా ఎన్నో కార్పోరేట్ విద్యా సంస్థలతో పాటు చరిత్ర కలిగిన ఎన్నో విద్యాలయాలు ఇక్కడ ఏర్పాటయ్యాయి.

వైద్య కళాశాల ఏర్పాటు



ఎన్నో దశాబ్దాలుగా ఏలూరు ప్రాంత ప్రజలు ఎదురు చూస్తున్న మెడికల్ కళాశాల ఏర్పాటు కావడంతో ఈ ప్రాంతంలో వైద్యపరంగా అభివృద్ధి సాధ్యమైంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2019లో ఇక్కడ మెడికల్ కళాశాల ఏర్పాటుకు జీవో విడుదలైంది. రూ. 430 కోట్లు మంజూరు చేశారు. 2023 ఏప్రిల్ నెలలో ఏలూరులో మెడికల్ కళాశాల ఏర్పాటైంది. ఈ కళా శాలకు మెడికల్ కౌన్సిల్ 150 సీట్లు కేటాయించారు. టీచింగ్ ఆస్పత్రికి 300 పడకలు కేటాయించారు. ఇక్కడ మెడికల్ కళాశాల ఏర్పాటుతో ఈ ప్రాంత వాసుల కల నెరవేరింది. ఇప్పటికే ప్రైవేటు రంగంలో ఆశ్రం మెడికల్ కళాశాల ఉండగా ప్రభుత్వ పరంగా ఏలూరు మెడికల్ కళాశాల కూడా ఏర్పాటు కావడంతో ఏలూరు జిల్లా వాసులకు వైద్య పరంగా సేవలు అందనున్నాయి.



పారిశ్రామిక ప్రగతి

ఏలూరులో ఎంతో ప్రసిద్ధి గాంచిన అంబికా గ్రూప్ సంస్థల ఆధ్వర్యంలో అంబికాదర్బార్ బత్తి పరిశ్రమ ఎందరికో ఉపాధి కల్పిస్తోంది. అలాగే ఇక్కడ ఎన్నాళ్ల నుంచో తివాచీ పరిశ్రమ, చేనేత పరిశ్రమలు అభివృద్ధి చెందాయి. ఏలూరు తివాచీలకు అంతర్జాతీయంగా మంచి పేరు ప్రఖ్యాతులు ఉన్నాయి. ఇక్కడ నుంచి రక రకాల డిజైన్లలో తివాచీలు విదేశాలకు కూడా ఎగుమతి అవుతుంటాయి. శనివారపుపేట,తంగెళ్ళమూడిలలో ఈ తివాచీ పరిశ్రమలు ఉన్నాయి. ప్రస్తుతం చేతితో తయారు చేసే తివాచీలకు ఆదరణ తగ్గటంతో కార్మికులు వీధిన పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే ఇక్కడ పత్తేబాదలో చేనేత పరిశ్రమ అభివృద్ధి చెందింది. చేనేత చీరలు ఇక్కడ సొంతంగా చేనేత కార్మికులు రూపొందిస్తారు. ఈస్టిండియా కంపెనీ వారి జనపనార పరిశ్రమ (జూట్‌మిల్) నగరలోఓ ఎంతోమందికి ఉపాధి నిచ్చేది. ఈ పరిశ్రమ గత ఏడాది మూత బడింది.

స్వాతంత్రోద్యమంలో ఏలూరు

స్వాతంత్రోద్యమంలో ఏలూరు ప్రధాన భూమిక పోషించింది. మహాత్మా గాంధీజీ 1921 ఏప్రిల్ 25న ఏలూరు విచ్చేశారు. ఆనాడు 50 వేల మందితో సభ ఏర్పాటు చేశారు. 1894లో ఏలూరులో జరిగిన కృష్ణా జిల్లా రైతుల మహా సభలో నీటి తీరువా హెచ్చింపునకు వ్యతిరేకంగా తీర్మానించి నీటి తీరువా తగ్గించేవరకు భూములను సాగు చేయకుండా బీడు పెట్టాలని నిర్ణయించారు. ఎన్నో స్వాతంత్రోద్యమాలకు ఆనాడు ఏలూరు వేదిక అయింది.



సంస్కృతీ సంప్రదాయాలకు నెలవు

సంస్కృతిపరంగా ఏలూరు ఎంతో అభివృద్ధి సాధించింది. ఏలూరులో ఉన్న వైఎంహెచ్‌ఏ హాలు కూడా సాంస్కృతీ కేంద్రంగా విలసిల్లుతోంది. ఎంతో మంది కళాకారులు ఇక్కడ నుంచి వెళ్లిన వారే పసుపులేటి కన్నాంబ ఏలూ రుకు చెందిన వారే . ఎంతో మంది నర్తకీ మణులు ఇక్కడ నుంచి వచ్చినవారే. రిజర్వు బ్యాంక్ గవర్నరుగా పనిచేసిన దువ్వూరి సుబ్బారావు ఈ ప్రాంత వారే అని చెప్పవచ్చు. ఆనందరామం వంటి వారు కూడా ఈ ప్రాంతానికి చెందిన వారే కావడం విశేషం.

నియోజకవర్గం : ఏలూరు
మొత్తం ఓటర్లు : 2,35,426
పురుష ఓటర్లు : 112,426
మహిళా ఓటర్లు : 1,22,872
ఇతర ఓటర్లు: 47
మండలాలు: ఏలూరు, కార్పోరేషన్, ఏలూరు రూరల్ మండలం

సంవత్సరం	విజేత	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ	మెజార్టీ
1952	జి.సత్యనారాయణ	సీపీఐ	ఎం.రంగయ్య	కాంగ్రెస్	7,638
1955	శీర్ల బ్రహ్మయ్య	కాంగ్రెస్	ఎఎస్ రావు	సీపీఐ	5,306
1962	ఎ.సర్వేశ్వరరావు	కాంగ్రెస్	ఎ.సర్వేశ్వరరావు	సీపీఐ	4,840
1972	ఏ.శ్రీరాములు	ఇండిపెండెంట్	ఎం.వెంకటనారాయణ	కాంగ్రెస్	1,805
1978	ఎన్.సూర్యప్రకాశరావు	కాంగ్రెస్-ఐ	ఏ.శ్రీరాములు	జనతా	10,712
1983	చెన్నకేశవుల రంగారావు	టీడీపీ	పీవీఎస్ నారాయణ	కాంగ్రెస్-ఐ	47,715
1985	మరడాని రంగారావ	టీడీపీ	ఎస్‌బీ సత్యనారాయణ	కాంగ్రెస్-ఐ	20,040
1989	నేరెళ్ళ రాజా	కాంగ్రెస్-ఐ	మరడాని రంగారావు	టీడీపీ	4,339
1994	మరడాని రంగారావు	టీడీపీ	మాగంటి వరలక్ష్మి	కాంగ్రెస్-ఐ	9,247
1999	అంబికా కృష్ణ	టీడీపీ	ఆళ్ళ కాళీకృష్ణ శ్రీనివాస్	కాంగ్రెస్-ఐ	7,315
2004	ఆళ్ళ కాళీకృష్ణ శ్రీనివాస్	కాంగ్రెస్-ఐ	ఎం.రంగారావు	టీడీపీ	33,053
2009	ఆళ్ళ కాళీకృష్ణ శ్రీనివాస్	కాంగ్రెస్-ఐ	బడేటి కోట రామారావు	ప్రజారాజ్యం	13,862
2014	బడేటి కోట రామారావు	టీడీపీ	ఆళ్ళ కాళీకృష్ణ శ్రీనివాస్	వైసీపీ	24,063
2019	ఆళ్ళ కాళీకృష్ణ శ్రీనివాస్	వైసీపీ	బడేటి కోట రామారావు	టీడీపీ	4,072

టీడీపీకి కంచుకోట

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 1951లో ఏలూరు అసెంబ్లీ నియోజక వర్గం ఏర్పాటు అయింది. 1983లో టీడీపీ ఆవిర్భావం తర్వాత 9 సార్లు ఎన్నికలు జరుగగా ఐదు సార్లు టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు. 1983లో టీడీపీ ప్రభంజనంలో ఏలూరులో వైద్యవృత్తిలో పేదల కోసం విశేష సేవలందించిన డాక్టర్ చెన్న కేశవులు రంగారావును ఆనాడు ఎన్టీ రామారావు టీడీపీ అభ్యర్థిగా ప్రకటించారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్-ఐ పార్టీ అభ్యర్థి నారాయణపై 47,515 ఓట్ల అత్యధిక మెజారిటీతో విజయం సాధించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఈ నియోజకవర్గంలో అంత పెద్ద మెజా రిటీ సాధించిన అభ్యర్థులు ఎవరూ లేరు.1985లో జరిగిన ఎన్నికలలో టీడీపీ అభ్యర్థిగా మరడాని రంగారావు పోటీ చేసి విజయం సాధించారు. ఆయన ఎన్టీఆర్ కేబినెట్‌లో మంత్రిగా కూడా పనిచేశారు. ఇక ఏలూరు అసెంబ్లీ నియోజక వర్గ చరిత్రలో మూడు సార్లు ఒకే అభ్యర్థి విజయం సాధించిన వ్యక్తి ఒక్కరే ఉన్నారు. ఆళ్ళ కాళీకృష్ణ శ్రీనివాస్ 1999 నుంచి 2019 వరకు 5 సార్లు ఎన్నికలలో పోటీ చేసి 3 సార్లు విజయం సాధించారు. కాంగ్రెస్ తరపున రెండు సార్లు, వైసీపీ తరపున ఒకసారి ఆయన విజయం సాధించారు. 1999 ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీ చేసి విజయం సాధించిన తొలి పారిశ్రామిక వేత్త అంబికా కృష్ణగా పేర్కొనవచ్చు. 2009లో ప్రజారాజ్యం పార్టీ తరపున బడేటి కోట రామారావు పోటీచేసి ఓటమి చెందినా రెండో స్థానాన్ని దక్కిం చుకున్నారు. అప్పట్లో టీడీపీ తరపున పోటీచేసిన అంబికా కృష్ణ మూడో స్థానంలో నిలిచారు. 2014లో జరిగిన ఎన్నికలలో టీడీపీ అభ్యర్థిగా బడేటికోట రామారావు పోటీ చేసి తన సమీప ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థి ఆళ్ళ కాళీకృష్ణ శ్రీనివాస్‌పై 24,603 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 2019 ఎన్నికలలో వైసీపీ అభ్యర్థి ఆళ్ళకాళీ కృష్ణ శ్రీనివాస్ (నాని) టీడీపీ అభ్యర్థి బడేటి కోట రామారావుపై 4,072 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 2019లో జనసేన పార్టీ ఆవిర్భావం కాగా జనసేన అభ్యర్థిగా పోటీ చేసిన రెడ్డి అప్పల నాయుడుకు 16,800 ఓట్లు వచ్చాయి. ఈ నియోజక వర్గంలో వివిధ సామాజిక వర్గాలకు చెందిన నేతలు అభ్యర్థులుగా విజయం సాధించారు.

సీఎం వచ్చారుగా..

నరకం చూసిన ఏలూరు ప్రజలు

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పర్యటనతో బుధవారం ఏలూరు ప్రజలు నరకం చూశారు. అసలే మండుతున్న ఎండలు. ఆపై ప్రధాన రహదారులు మూసి వేయడంతో జనం ఎటు వెళ్లాలో తెలియక నానా అవస్థలు పడ్డారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి, కోర్టు ఉన్న ప్రధాన రహదారి పైనే రోడ్‌షో ఉండడంతో ఉదయం 11 గంటల నుంచే పోలీసులు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ప్రభుత్వాసుపత్రికి వెళ్ళేవారు కూడా నరకయాతన పడ్డారు. నగరానికి వచ్చే బస్సులు కూడా వేరే మార్గాల్లో పంపించారు. వ్యాపారులు షాపులను మూసుకోవాల్సి వచ్చింది. ద్విచక్ర వాహనాలు, కార్లతో ఆసుపత్రిలో హారన్స్ వేసుకుంటూ చక్కెర్లు కొట్టారు. రోగులకు తీవ్ర ఇబ్బందులు కలిగించారు. వైసీపీ కార్యకర్తలు ఆకతాయిలుగా మారారు. వాటర్ ప్యాకెట్లను చింపి ఆ నీళ్ళను మహిళలపై చిమ్మారు. జేబుదొంగలు జనం పర్సులు,సెల్‌ఫోన్లు కొట్టేశారు. ఆర్‌ఆర్ పేటలో పార్కింగ్ చేసిన ఒక మోటారు సైకిల్‌ను కూడా ఎత్తుకు పోవడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన ముగిసిన సాయంత్రం 6 గంటల వరకూ నగరంలోని ప్రజలు నరకయాతన చూడాల్సి వచ్చింది. - ఏలూరు క్రైం


బస్సులన్నీ బయటే.. బస్టాండ్ ఖాళీ..



పోలీసుల అధీనంలో నగరం
ఆసుపత్రికి వెళ్లే దారి బంద్




ఆర్‌ఆర్‌పేట వెళ్లే ప్రధాన రహదారిని మూసివేసిన దృశ్యం
ప్రజల అవస్థలు
సీఎం సభ కోసం విద్యుత్ స్తంభం కట్ చేశారు..


నిడదవోలులో మూర్తి పార్థివదేహాన్ని మోస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ బాపిరాజు


మూర్తి (ఫైల్)

గుండెపోటుతో జడ్పీ ఏవో మృతి

ఏలూరుసిటీ, మే 1:నిజాయితీగా సేవలందిస్తూ అందరి మన్ననలు పొందిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజా పరిషత్ హెచ్ సెక్షన్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి (ఏవో)గా పనిచేస్తున్న కంజులూరి నరసింహమూర్తి (56) మంగళవారం రాత్రి గుండెపోటుతో నిడదవోలులో మృతి చెందారు. జడ్పీ ఉద్యోగులు నిడదవోలు వెళ్లి మూర్తి పార్థివ దేహానికి నివాళులర్పించారు. జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజుకు మూర్తితో ఉన్న అనుబంధంతో అంతిమ యాత్రలో పాల్గొని పాడె మోశారు. నరసింహమూర్తికి భార్య, కుమారుడు ఉన్నారు. నరసింహమూర్తి 1994లో జూనియర్ అసిస్టెంట్‌గా తన ఉద్యోగ జీవితాన్ని ఆరంభించారు. కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో కొంతకాలం పనిచేసి అక్కడి నుంచి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజాపరిషత్‌కు సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతిపై వచ్చారు. 2014 నుంచి 2019 వరకు అప్పటి జిల్లా పరిషత్ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజుకు మూర్తి సీసీగా పనిచేశారు. అనంతరం 2019లో విజయవాడ ఏపీఎస్ ఐఆర్‌డీలో పనిచేసి తిరిగి పదోన్నతిపై జిల్లా ప్రజా పరిషత్‌కు అడ్మిని స్ట్రేటివ్ అధికారిగా వచ్చారు.ఆయన మృతికి జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్, జడ్పీ సీఈవో సుబ్బారావు, డిప్యూటీ సీఈవో నిర్మలా జ్యోతి, అకౌంట్స్ అధికారి ప్రకాష్, పంచాయతీరాజ్ మినిస్టీరియల్ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రాజు, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘ గౌరవాధ్యక్షుడు గోవింద రాజులు, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.



డీఏలేవి ? జగనన్నా..!

ఐదేళ్లుగా ఉద్యోగుల అవస్థలు



ఉద్యోగుల సంక్షేమం పట్టని సర్కారు
పెరుగుతున్న ధరలతో పెనుభారం
ఐదేళ్లక్రితం నాటి జీతాలే దిక్కు
1వ తేదీ జీతం పడితే చాలనే పరిస్థితి
డీఆర్ కోసం పెన్షనర్ల ఎదురుచూపులు

(నిడమర్రు)

ప్రభుత్వం ఉద్యోగుల గురించి ఇసుమంతైనా పట్టించుకోవడం లేదు. న్యాయబద్ధంగా ఇవ్వాల్సిన కరువు భత్యం బకాయిలు ఇప్పించాలని ఎన్నిసార్లు మొరపెట్టుకొన్నా పట్టించుకున్న పాపానపోలేదు. ఉద్యోగులను కేవలం తమ సేవకులుగా మాత్రమే చూస్తున్నారని వాపోతున్నారు. ప్రతి ఆరు నెలలకు అందాల్సిన కరువు భత్యం ఇవ్వడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్క పెడుతోందని ఆవేదన చెందుతున్నారు. "అన్ని వస్తువుల ధరలు పెరిగి పోయాయి.. నానాటికి పెరుగుతున్న ఖర్చులు తట్టుకోలేక అప్పులు పాలవుతున్నామంటూ" ఒక ఉద్యోగి ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వం ఇంత కసాయిగా వ్యవహరించలేదని ఉద్యోగులు వాపోతున్నారు.

1వ తారీఖున జీతం పడితే చాలనే పరిస్థితి

ప్రతి నెల 1వతారీఖున జీతం పడితే చాలనే పరిస్థితిలో ఉద్యోగులు ఉన్నారు. రెండేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ముఖ్యంగా ఉపాధ్యాయులకు ప్రతి నెల 10 నుంచి 15వ తారీఖులోపు జీతం పడుతోంది. ఉద్యోగులకు ప్రతి నెల జీతం సొమ్ము నుంచి గృహం, వాహన,వ్యక్తిగత ఋణాలకు సంబంధించి ఈఎంఐలు కట్ అవుతాయి. ఇటీవల ప్రభుత్వం జీతాలు ఆలస్యంగా వేయడంతో అపరాధ రుసుముతో పాటు సిబిల్ స్కోరు కోల్పోవలసి వస్తోంది, అందుకే ఇటీవల ప్రభుత్వంతో జరిపిన చర్చల్లో ఉద్యోగుల మొదటి డిమాండ్ 1వ తారీఖునే జీతాలు ఇప్పించాలని కోరారు.



మూడు డీఏలకు మంగళం

ఈ ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం ఉద్యోగులకు 10 డీఏలు ఇవ్వాల్సి ఉంది. రెండేళ్ల క్రితం విజయవాడలో ఉద్యోగులు ఆందోళన చేపట్టిన నాటికి ఆరు డీఏలు ఇవ్వాల్సి ఉంది. ఆ సమయంలో ఉద్యోగ వర్గాలతో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చల్లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా మూడు డీఏలు మాత్రమే ఇస్తామని మిగిలిన మూడు డీఏలు ఇవ్వలేమని చేతులెత్తేసింది. ఈ పరిస్థితుల్లో ఉద్యోగవర్గాలు చేసేది లేక కనీసం మూడు డీఏలు అయినా వస్తాయని ఎదురు చూశారు. ఈ మూడు డీఏలు కూడా 2024 మే నెలలో ఒక డీఏకు సంబంధించి సొమ్ము, జూలైలో కొంత, అక్టోబరులో కొంత ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. హామీ ఇచ్చిన డీఏలతో పాటు మరో నాలుగు డీఏలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది.

జిల్లాలో ఉద్యోగులు :

ఆరోగ్య శాఖ	5,450
పోలీసు శాఖ	3,400
రెవెన్యూ శాఖ	7,200
ఉపాధ్యాయులు	14,500
ఎయిడెడ్	2,500
నాల్గో తరగతి	6,200
మొత్తం ఉద్యోగులు	**39,250**

పెన్షనర్లు వివరాలు :

సర్వీసు పెన్షనర్లు	15,200
ఫ్యామిలీ పెన్షనర్లు	10,750
జడ్పీ పెన్షనర్లు	2,500
మొత్తం పెన్షనర్లు	**28,450**

డీఆర్ కోసం పెన్షనర్ల అవస్థలు

రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులకు అందించే డియర్‌నెస్ రిలీఫ్ (డీఆర్) కూడా పెండింగ్‌లో పెట్టింది. 2018 నుంచి పెన్షనర్లుకు రావల్సిన డీఆర్ బకాయిలు ప్రభుత్వం ఇప్పటివరకు చెల్లించేదని మలివిడతలో ప్రవేశించిన పెన్షనర్లు కన్నీటి పర్యంతమవుతున్నారు.

డీఏ బకాయిలు ఇలా..

1. 07/2018 - 3.144% 30 నెలల బకాయిలు ట్రెజరీలో బిల్స్ పెండింగ్
2. 01/2019 - 3.144% 30 నెలలు
3. 07/2019 - 5.240%- 30 నెలలు
4.01/2020 -4.% -18 నెలల బకాయిలు కొవిడ్ ఖాతాలో మాఫీ అయ్యాయి. ఆరు నెలల బకాయిలు పీఆర్సీలో కలిపి రిటైర్మెంట్ నాటికి వస్తాయి.
5. 07/2020 - 5%-12 నెలల బకాయిలు కొవిడ్ ఖాతాలో మాఫీ అయ్యాయి. ఆరునెలల బకాయిలు పీఆర్సీలో కలిపి రిటైర్మెంట్ నాటికి వస్తాయి.
6. 01/2021 -5%- ఆరు నెలల బాకాయిలు కొవిడ్ ఖాతాలో మాఫీ అయ్యాయి. ఆరు నెలల బకాయిలు పీఆర్సీలో కలిపి రిటైర్మెంట్ నాటికి వస్తాయి.
7. 07/2021 - 5%- 6 నెలల బకాయిలు పీఆర్సీలో కలసి రిటైర్మెంట్ నాటికి వస్తాయి.
8. 01/2022 - ఇప్పటికి 27 నెలల బకాయి ఉంది.
9. 07/2022 - ఇప్పటికి 21 నెలల బకాయి
10. 01/2023- విడుదల చేశారు. మే నెల నుంచి జీతంలో కలుస్తుంది. ఇప్పటికి పాతవి 15 నెలల బకాయి ఉంది.
11. 07/ 2023 - విడుదల చేశారు. మే నెల జీతం నుంచి జీతంలో కలుస్తుంది. ఇప్పటికి పాతవి 15 నెలల బకాయి ఉంది.
12. 01/2024 - విడుదల కాలేదు. ఇప్పటికి మూడు నెలల బకాయి ఉంది.

పై వివరాలు పరిశీలిస్తే..

- 60 నెలల బకాయిలు ట్రెజరీ ఆమోదం పొంది పేమెంట్ కోసం రెండేళ్ల నుంచి ఎదురుచూపులు.
- 36 నెలల బకాయిలు కొవిడ్ పేరు చెప్పి మాయం చేశారు.
- 54 నెలల బకాయిలు పీఆర్సీలో కలిపేసి చెల్లింపులు రిటైర్‌మెంట్‌కి వాయిదా వేశారు.
- 27 నెలల బకాయిలు ప్రభుత్వం విడుదల చేయకపోవడం వల్ల పెండింగ్‌లో ఉన్నాయి.
- 2003 డీఎస్సీ ఉపాధ్యాయుడు ఈ ఐదేళ్లలో నష్టపోయిన సొమ్ము రూ1.80 లక్షలు.
- 2006 డీఎస్సీ ఉపాధ్యాయుడు ఐదేళ్లలో నష్టపోయిన సొమ్ము రూ. 1.68 లక్షలు.

నారాయణపురంలో 'జనంలోకి ధర్మరాజు'

ఉంగుటూరు, మే 1 : ప్రజల కష్టాలను తెలుసుకుని వారి సమస్యలను పరిష్కరించిన వారే నిజమైన ప్రజా సేవకులని ఉంగుటూరు కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. బుధవారం నారాయణపురంలో 'జనంలోకి ధర్మరాజు' కార్యక్రమంలో భాగంగా టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ శరణాల మాలతీరాణితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నారాయణపురం సర్పంచి దిడ్ల అలకనంద, నియోజకవర్గ జనసేన సమన్వయ కర్త వట్టి పవన్‌కుమార్, నియోజకవర్గ పరిశీలకులు పోతుల అన్నవరం, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు రెడ్డి సూర్యచంద్రరావు, అడపా శోభారాణి, ఆశీర్వాదం, మాజీ సర్పంచి ఎ.నాగమణి, కడియాల రవిశంకర్, ఇమ్మణ్ణి గంగాధరరావు, గోలి శ్రీనివాసరావు, వీర మహిళలు, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు

ఉంగుటూరు జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం పలు గ్రామాల నాయకులు జనసేనలో చేరారు. రావులపర్రుకు చెందిన దండ్రు రమేష్, మండల పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు, బాదంపూడికి చెందిన లేగల మురళీకృష్ణ మరి కొంతమంది మహిళలతో కలిసి పార్టీలో చేరారు. నియోజకవర్గ పరిశీలకుడు వట్టి పవన్‌కుమార్‌తో కలిసి జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు వారిని పార్టీలోకి ఆహ్వానించి కండువాలు కప్పారు.



నారాయణపురం ఎన్నికల ప్రచారంలో గన్ని, పత్సమట్ల కూటమి నేతలు

వైసీపీ మేనిఫెస్టో.. కొత్త సీసాలో పాత సారా

చింతలపూడి కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్

చింతలపూడి, మే 1: వైసీపీ మేనిఫెస్టో కొత్తసీసాలో పాత సారా మాదిరిగా ఉందని చింతలపూడి కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ విమర్శించారు. చింతలపూడి నగర పంచాయతీలోని నాగిరెడ్డిగూడెం, మోడల్‌కాలనీ, కొవ్వూరిగూడెం, నందమూరి విద్యానగర్ కాలనీల్లో ఆయన ప్రచారం చేశారు. ఇంటింటికి తిరిగి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మఒడి పథకంతో నాన్నబుడ్డి పేరుతో సొమ్ములు గుంజుతున్నారని, మద్యపాన నిషేధం చేసిన తరువాతే ఓట్లు అడుగుతానని చెప్పి నిషేధించకుండానే ఓట్లు అడుగుతున్నారంటూ ప్రశ్నించారు. మెగా డీఎస్సీ పేరుతో దగా డీఎస్సీ చేసి నిరుద్యోగులను మోసం చేశారన్నారు. మూడు రాజధానుల అని చెప్పి ఒక్క రాజధాని కూడా నిర్మాణం చేయలేదన్నారు. చంద్రబాబు కట్టించిన కార్యాలయాల్లోనే జగన్ పరిపాలన సాగిస్తున్నారని, అభివృద్ధి ఏంచేశారని ప్రశ్నించారు. తాను కష్టపడి సంపాదించుకున్న సొమ్ముతోనే రాజకీయాల్లోకి వచ్చానని గత పదేళ్ళుగా.. కరోనా సమయంలోనూ పేదలకు సొంత డబ్బులతోనే సేవా కార్యక్రమాలు చేపట్టానన్నారు. చింతలపూడి అభివృద్ధి సాధించాలంటే కూటమికి ఓటు వేయాలన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం రెండేళ్ళలో పూర్తి చేస్తామన్నారు.



నాగిరెడ్డిగూడెం ప్రచారంలో మాట్లాడుతున్న రోషన్‌కుమార్

చింతలపూడి పట్టణ రూపురేఖలు మార్చి అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. ప్రచారంలో బీజేపీ నాయకులు తోటా వెంకటనారాయణ, జనసేన నాయకులు పి.నాగవిజయ్‌కుమార్, టీడీపీ పట్టణ అధ్యక్షులు పక్కాల వెంకటేశ్వరరావు, బోడా అనిష్‌కుమార్, గుమ్మి భారతి, బాణావత్ ఉమాశంకర్, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్డీఏతో రాష్ట్రాభివృద్ధి సాధ్యం : గారపాటి

ఉంగుటూరు, మే 1 : ఏపీ రాష్ట్ర అభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వంలోని డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే సాధ్యమని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. బుధవారం నారాయణపురంలో కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు విజయానికి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, జనసేన ఉంగుటూరు అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు, శరణాల మాలతీరాణి, సర్పంచి దిడ్ల అలకనంద, వట్టి పవన్ కుమార్ పాల్గొన్నారు.



నారాయణపురంలో ప్రచారం చేస్తున్న పత్సమట్ల, గన్ని, గారపాటి

బటన్ కాదు.. గొంతు నొక్కాడు జగన్..

ఏలూరు రూరల్/పెదవేగి, మే 1 : సీఎం జగన్ బటన్ నొక్కడం కాదు, ప్రజల గొంతు నొక్కాడని దెందులూరు టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ విమర్శించారు. ఏలూరు రూరల్ మండలం చాటపర్రు, కె.డి.పురం తదితర ప్రాంతాల్లో ప్రచారంలో భాగంగా బుధవారం బుల్లెట్ వాహనంపై వెళ్తూ కార్యకర్తలను ఉత్సాహపరిచారు. పెదవేగి మండలం కొండలరావు పాలెంలో టీడీపీ నాయకులతో కలిసి చింతమనేని ప్రభాకర్ సతీమణి రాధారాణి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.



ప్రచారంలో బుల్లెట్ వాహనం నడుపుతున్న చింతమనేని ప్రభాకర్

కూటమి అభ్యర్థుల కోసం జానీ మాస్టర్ ప్రచారం

గణపవరం/నిడమర్రు/భీమడోలు, మే 1: భావితరాల భవిష్యత్తు కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాలని కొరియోగ్రాఫర్ జానిమాస్టర్ అన్నారు. బుధవారం గణపవరం మండల గ్రామాలతో పాటు నిడమర్రు మండలం నిడమర్రు, భువ్వనపల్లి, భీమడోలు మండలం పూళ్ళ, భీమడోలు గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఏలూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్‌కు, ఉంగుటూరు కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజుకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు.



గణపవరంలో ప్రచారం చేస్తున్న జానీ మాస్టర్

రక్షణ చట్టాలపై కార్మికులకు అవగాహన ఉండాలి

ఏలూరు క్రైం, మే 1 : కార్మికుల హక్కుల కోసం అనేక రక్షణ చట్టాలు ఉన్నాయని వాటిపై అవగాహన ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ పురుషోత్తమకుమార్ ఆదేశాల మేరకు జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న జిల్లా న్యాయసేవాసదన్‌లో కార్మికులకు మేడే సందర్భంగా చట్టాలపై అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. న్యాయవాదులు కూన కృష్ణారావు, కట్టా సత్యనారాయణ, కారంశెట్టి రమేష్‌బాబు, ఎపీఎస్ఆర్టీసీ సిబ్బంది సాంబశివరావు పాల్గొన్నారు.

జనసేన నాయకుడికి వడదెబ్బతో అస్వస్థత

పోలవరం, మే 1 : పోలవరం మండల జనసేన ఉపాధ్యక్షుడు తెలగంశెట్టి రాము బుధవారం వడదెబ్బకు గురై తీవ్ర అస్వస్థతకు లోనవడంతో పోలవరం ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు అతడికి చికిత్స అందించారు. జనసేన మండల అధ్యక్షుడు గునపర్తి చిన్ని ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్ని మాట్లాడుతూ ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉన్నట్టు తెలిపారు.

'టీడీపీ, జనసేన నాయకులు పొత్తు ధర్మం పాటించాలి'

పోలవరం, మే 1 : టీడీపీ, జనసేన నాయకులు పొత్తు ధర్మం పాటించి బీజేపీతో కలిసి పనిచేసేలా దిద్దుబాటు చర్యలు చేసుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరిబండి నాగరాజు హితవు పలికారు. బుధవారం పట్టిసీమ కమలా నరసింహ నిలయం అతిథిగృహంలో బీజేపీ మండల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు కార్యకర్తల పట్ల నిర్లక్ష్య ధోరణితో వ్యవహ రిస్తున్నారని ప్రచారాలు, ర్యాలీలు, సమావేశాలకు ఆహ్వానించకపోవడం, సమాచారం ఇవ్వకపోవడం వంటి చర్యలతో బీజేపీ నాయకులు, కార్యకర్తలను అసహనానికి గురయ్యేలా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే కూటమి అభ్యర్థుల విజయానికి బీజేపీ కేడర్ ఎంతవరకూ సహకరిస్తారనేది ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ఇప్పటికైనా టీడీపీ జనసేన అధినాయకులు, నియోజకవర్గ, మండల నాయకులు స్పందించి సమన్వయం చేసుకోవాలని సూచించారు.

నేత్రపర్వం..ధ్వజారోహణం

ద్వారకాతిరుమల, మే 1: శ్రీవారి క్షేత్రానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురం ఆల యంలో శ్రీనివాసునికి జరుగుతున్న కల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి జరిగిన ధ్వజారోహణ భక్తులకు నేత్రపర్వమైంది. ఉదయం ఆలయంలో విశేష పూజాధికాలు జరిగాయి. సాయంత్రం ఆలయ యాగశాలలో అర్చకులు, పండితులు అంకురార్పణ, వాస్తుహోమాలను నిర్వహించారు. గరుడప్రతిష్ట జరిపి ఆలయ ఆవరణలో మేళతాళాలు, మంగళవాయిద్యాలు, పండితుల మంత్రోచ్చరణల నడుమ అట్టహాసంగా ప్రదక్షిణ చేయిం చారు. ధ్వజస్తంభం వద్ద గరుడపటానికి హారతులిచ్చి, స్వామి కల్యాణమహోత్సవాలను వీక్షించేందుకు సర్వాది దేవతలను ఆహ్వానించే క్రమంలో ఆ పటాన్ని సంప్రదాయబద్ధంగా ఎగురవేశారు.



గరుడపటాన్ని ఎగుర వేస్తున్న పండితులు

ఓటుతో వైసీపీకి బుద్ధి చెప్పండి

ద్వారకాతిరుమల, మే1: ప్రజావ్యతిరేక పాలన చేస్తున్న వైసీపీకి ప్రజలు ఓటుహక్కు ద్వారా బుద్ధి చెప్పాలని తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడితేనే ప్రజా సంక్షేమ పాలన వస్తుందని టీడీపీ వాణిజ్య విభాగ జిల్లా నేత ఇమ్మడి రత్నాజీ అన్నారు. ద్వారకాతిరుమలలో బుధవారం పార్టీ నాయకులు కూరా కుల బుజ్జి, రేపూరి వెంకటేశ్వరరావు, తదితరులతో కలసి సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు.

వైద్య సిబ్బందికి షోకాజ్ నోటీసు

లింగపాలెం, మే 1 : వైద్య సిబ్బందికి ఎన్నికల అధికారులు షోకాజ్ నోటీసులు అందజేసిన ఘటన లింగపాలెం మండలం ఎడవల్లి గ్రామంలో జరిగింది. వివరాలివి.. ఎడవల్లి గ్రామంలోని ఆరోగ్య ఉప కేంద్రంలో గ్రామానికి చెందిన కొందరు వైసీపీ నాయకులు రోగులకు మంచాలను అందజేసే కార్యక్రమంలో కొంతమంది వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ విషయమై ఎన్నికల అధికారులు వారికి షోకాజ్ నోటీస్ అందజేశారు. ఈ విషయమై ఎంపీడీవోను వివరణ కోరగా గ్రామంలో వైద్య సిబ్బంది పాల్గొన్న సంఘటన తమ దృష్టికి వచ్చిందని దానిపై సిబ్బందికి షోకాజ్ అందించామని తెలిపారు. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలిపామన్నారు. .డాక్టర్ నైమీషాను ఈ విషయమై వివరణ కోరగా రోజువారి కార్యక్రమాలలో భాగంగా ఉప కేంద్రాన్ని సందర్శించామని ఆ సమయంలో కొందరు వ్యక్తులు వైద్యకేంద్రంలో రెండు మంచాలను తీసుకువచ్చి వారి వాటిని ప్రారంభించి వెళ్లిపోయారని ఈ విషయమై తమకు, సిబ్బందికి ఏమీ తెలియదని అన్నారు.



ఏలూరులో మే డే కార్యక్రమంలో కార్మికులు.. పెదవేగిలో మే డే వేడుకలు.. ఎం.నాగులపల్లిలో సీపీఎం నాయకుల జెండా ఆవిష్కరణ

ఎర్ర జెండా రెపరెపలు

ఘనంగా మే డే వేడుకలు

జిల్లావ్యాప్తంగా బుధవారం మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల కార్యాలయాల్లోనూ నాయకులు, కార్మికులు ఎర్ర జెండాలను ఆవిష్కరించారు.

ఏలూరు టూటౌన్, మే 1: ఏలూరు ఓవర్ బ్రిడ్జి వద్ద జరిగిన మేడే వేడుకల్లో ఏలూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య పాల్గొన్నారు. కేక్‌ను కట్ చేసి మేడే శుభాకాంక్షలు తెలిపారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నగరంలో 60చోట్ల మేడే ఉత్సవాలు నిర్వహించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 16సర్కిల్స్‌లో మేడే ఉత్సవాలు నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యలయంలో జిల్లా కార్యదర్శి ఎ.రవి ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు.

- దెందులూరు/పెదవేగి, మే 1 :దెందులూరులో జరిగిన మేడే వేడుకల్లో కార్మికుల సంఘం నాయకుడు కాకర్ల శ్రీను, గంగరాజు, రవి, దాసే శ్రీను, తోట పద్మారావు తదితరులు మేడే జెండాను ఆవిష్కరించారు. పెదవేగి మండలంలో కార్మికులు మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పెదవేగి, కవ్వగుంట. లక్ష్మీపురంలోని దెందులూరు మార్కెట్‌యార్డు దగ్గర సీఐటీయూ పతాకాన్ని జిల్లా నాయకుడు మావూరి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. పెదవేగిలోని పామా యిల్ ఫ్యాక్టరీ దగ్గర ఇఫ్టూ ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు.
- ఉంగుటూరు/భీమడోలు : ఉంగుటూరు మండలం చేబ్రోలు, నారాయణపురం, కైకరం గ్రామాల్లో సీఐటీయూ జెండాలను ఎగురవేశారు. సీఐటీయూ పూర్వ జిల్లా అధ్యక్షుడు గుడిపాటి నరసింహారావు, మండల అధ్యక్షుడు సీరా అప్పా రావు, రైతు సంఘం సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు, కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు పాల్గొన్నారు. భీమడోలు మండలం భీమడోలు జంక్షన్‌లో సీఐటీయూ జిల్లా నాయకుడు ఆర్.లింగరాజు ఆధ్వర్యంలో సీఐటీయూ జెండాను మండల అధ్యక్షురాలు స్వర్ణకుమారి ఆవిష్కరించారు.
- వేలేరుపాడు/కుక్కునూరు : వేలేరుపాడు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో సీపీఐ, అనుబంధ సంస్థ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజా పందా ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో జెండాను ఎగురవేశారు. కుక్కునూరు మండలంలో సీఐటీయూ, సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ ప్రజాపందా, ఏఐటీయూసీ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. కుక్కునూరులో ర్యాలీ నిర్వహించారు.
- చింతలపూడి/కామవరపుకోట/లింగపాలెం, చింతలపూడి పాత బస్టాండ్‌లో జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు ఏఐటీయూసీ పతాకాన్ని ఆవిష్కరిం చారు. గొరుపట్లగూడెం రోడ్డులో ముఠా వర్కర్స్ ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు వెంకటేశ్వరరావు, సీపీఐ కార్యాలయంలో ఎస్.కె కాలీష, ఎస్.కె జానీ, యర్రగుండపల్లిలో శ్రీరామాచారి, గణిజర్లలో డోలా ప్రసన్న, పాత చింతలపూడిలో బోడా వజ్రం జెండా ఆవిష్కరణలు చేశారు. కామవరపుకోట మండలం కామవరపుకోటలో సీపీఐ, ఏఐటీయూసీ సంయుక్త ఆధ్వర్యంలో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. సీపీఐ నాయకుడు టీవీఎస్ రాజు, కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు. లింగపాలెం మండలం లింగపాలెంలోని అంగన్వాడి సిబ్బంది, కార్మికులు మే డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.
- బుట్టాయగూడెం/జీలుగుమిల్లి/పోలవరం :బుట్టాయగూడెం తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే జెండాను మండల నాయ కురాలు పుష్ప ఆవిష్కరించారు. కేఆర్ పురంలో సివిల్ సప్లై గిరిజన కార్పొరేషన్ వద్ద ఇఫ్టూ డివిజన్ నాయకుడు కోర్స కిషోర్ జెండాను ఎగురవేశారు. జీలుగుమిల్లి మండలం జీలుగుమిల్లిలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్యదర్శి సీహెచ్.కొండలరావు మేడే సందర్భంగా జెండా ఆవిష్కరించారు. పోలవరం మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లెల్లగూడెం పంచాయతీ రెడ్డినాగంపాలెంలో ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి షేక్ బాషా, గిన్నేపల్లి నాగిరెడ్డి, సవలం రాంబాబు, మాండ్రు ఎర్రంరెడ్డి తదితరులు మేడే జెండా ఎగురవేశారు.
- నిడమర్రు :నిడమర్రు ప్రజాసంఘాల కార్యాలయంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నారపల్లి రమణారావు జెండా ఆవిష్కరణ చేశారు. పిల్లా హరికుమారి, ఆసుపూ హరిప్రసాద్, చినిమిల్లి రాంబాబు, కానూరు శ్రీను, నిమ్మల పార్వతి, కోన శ్రీనివాసరావు, వెలగలేటి మోహన్, లావేటి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.
- ద్వారకాతిరుమల : కార్మిక చట్టాల పరిరక్షణ కోసం కార్మికులు, ఉద్యోగులు ఐక్య పోరాటాల్లో పాల్గొనాలని సీపీఎం నేత కట్టా భాస్కరరావు పిలుపునిచ్చారు. మండ లంలోని ఎం.నాగులపల్లి, పి.కన్నాపురం గ్రామాల్లో బుధవారం ఉదయం మేడే వేడుకలు ఘనంగా జరిగాయి.ముందుగా పతాకావిష్కరణ చేసి అనంతరం మాట్లాడారు. కార్మి కుల హక్కుల సాధనకు పోరాటాలే శరణ్య మన్నారు. గోల్కొండ నాగరాజు, వీర్రాజు, పి.కన్నాపురంలో కోకోకోలా ఫ్యాక్టరీ డ్రైవర్లు పాల్గొన్నారు.

క్రైం వార్తలు

• ఘోరం

కొడవలితో దాడి చేసి భార్యను చంపిన భర్త

జంగారెడ్డిగూడెం (బుట్టాయగూడెం) మే 1 : భర్త చేతిలో భార్య హత్యకు గురైన ఘటన జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం బాబ్జీ నగర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. బొబ్బర ఝాన్సీ(33) బుధవారం ఇంటిలోనే భర్త వంశీవర్మ హత్య చేసి పరార య్యాడు. ఇంటిని అమ్మాలనే విషయమై భార్యభర్తల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. గతంలో ఝాన్సీ కుటుంబం తాటాకు ఇంటిలో ఉండేవారు. ఇటీవల అప్పుచేసి బిల్డింగ్‌ను కట్టుకున్నారు. ఝాన్సీ జంగారెడ్డిగూడెంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో పనిచేస్తుండగా వంశీవర్మ తాపీపని చేస్తుంటాడు. మద్యానికి బానిసై అప్పులు చేశాడు. అప్పులవాళ్లు ఒత్తిడి చేస్తుండడంతో ఇల్లును అమ్ముదామని భార్యపై ఒత్తిడి తేవడం ప్రారంభించాడు. ఇంటిని అమ్మేందుకు భార్య ఒప్పుకోకపోవడంతో ఇరువురి మధ్య వివాదం జరిగింది. ఇదే సమయంలో ఇంటిలో ఉన్న ఇద్దరు పిల్లలు రిషి, చర్రిలను ఆడుకోడానికి బయటకు పంపి భార్యపై కొడవలితో దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. తీవ్ర గాయాలైన ఆమె రక్తపుమడుగులో మరణించింది. అనంతరం భర్త వంశీవర్మ ఇంటికి గడియవేసి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ జ్యోతిబసు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించి.. అనుమానస్పదస్థితిలో మహిళ మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఝాన్సీ(ఫైల్)

వరకట్న వేధింపుల కేసు నమోదు

ఏలూరు క్రైం, మే 1 : వివాహ సమయంలో ఇచ్చిన కట్నం చాలలేదంటూ అదనపు కట్నం తీసుకురావాలని వేధించడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. జాలిపూడి గ్రామానికి చెందిన కొల్లి విజయఅనూష 2022లో కృష్ణాజిల్లా ముదినేపల్లి మండలం పెరగనూరుకు చెందిన రాగాల ప్రభుకుమార్‌తో వివాహం జరిగింది. వివాహ సమయంలో ఇచ్చిన కట్నం చాలలేదని అదనపు కట్నం తీసుకు రావాలని ప్రభుకుమార్ వేధింపులకు గురి చేశాడు. బాధితురాలు ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోసగించిన యువకుడిపై కేసు

ఏలూరు క్రైం, మే 1 : ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసి పెళ్ళికి నిరాకరించిన యువకుడిపై ఏలూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏలూరు రూరల్ మండలం ఓ గ్రామానికి చెందిన యువతికి ఏలూరు రూరల్ మండలం కొమడవోలుకు చెందిన గరికపూడి రాజీవ్ పరిచయం అయ్యాడు. ఆ పరిచయం ప్రేమగా మారింది. 2019 నుంచి పరిచయం పెరిగి ఆపై పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. వివాహేతర సంబంధం కొనసాగించి ఆమెను గర్భిణిని చేసి టాబ్లెట్స్ ఇచ్చి గర్భాన్ని విచ్ఛిన్నం చేశారు. ఆపై పెళ్లికి నిరాకరించడంతో బాధితురాలు మనస్తాపానికి గురై పురుగు మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ సమాచారం ఏలూరు రూరల్ పోలీసులకు అందడంతో గరికపూడి రాజీవ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత

కుక్కునూరు, మే 1 : కుక్కునూరు మండల పరిధిలోని మారేడుబాక అటవీ ప్రాంతంలో మారుజాతి కలపను అక్రమంగా తరలిస్తుండగా అటవీ శాఖ సిబ్బంది పట్టుకున్నారు. అడవిలో ఉన్న నకిర, కొడిస చెట్లను నరికి వేసి వాటిని దిమ్మలుగా తయారు చేశారు. అనంతరం ఆ దిమ్మలను ఓ వాహనంలో లోడ్ చేసి అక్రమంగా తరలిస్తున్న క్రమంలో అటవీశాఖాధికారులకు సమాచారం అందింది. దాడి చేసి వాహనంతో పాటు కలపను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆ కలపను కుక్కునూరు అటవీరేంజ్ కార్యాలయానికి తరలించారు. దాదాపు రూ.60 వేలు వరకు పట్టుబడిన కలప విలువ ఉంటుందని అధికారులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు అటవీ సిబ్బంది తెలిపారు.

మద్యానికి సొమ్ములు ఇవ్వలేదని తల్లిని హతమార్చిన తనయుడు

ఏలూరు క్రైం, మే 1 : మద్యానికి బానిసైన కుమారుడు మద్యం తాగడానికి తన తల్లి పెన్షన్ సొమ్ములను ఇవ్వలేదని ఆగ్రహించి కర్రతో తలపై మోదడంతో ఆమె స్పృహ తప్పిపడిపోయింది. ఆపై మృత్యువాత పడింది. ఈ ఘటన బుధవారం రాత్రి ఏలూరు జిల్లా ఏలూరు నగరంలో జరిగింది. ఏలూరు పడమర వీధి దొంగల మండపం ప్రాంతంలో డొక్కు కృష్ణవేణి(54) భర్త వెంకటేశ్వరరావు కొన్నేళ్ల క్రితం మరణించాడు. ఆమెకు ముగ్గురు కుమార్తెలు ఉండగా ఒకరికి వివాహమైంది. కుమారుడు హరికృష్ణ ఆమె వద్దే ఉంటున్నాడు. అతడికి వివాహం కాలేదు. ఏపని చేయకుండా మద్యానికి బానిసైన హరికృష్ణ తరచుగా డబ్బుల కోసం తల్లిని కొడుతూ ఉంటాడు. బుధవారం ఆమెకు విడో పెన్షన్ రావడంతో ఆ సొమ్మును మద్యం తాగడానికి బుధవారం రాత్రి ఇవ్వాలని హరికృష్ణ ఆమెను కోరాడు. ఆమె నిరాకరించడంతో తలపై కర్రతో కొట్టి.. తల పట్టుకుని గోడకు వేసి కొట్టాడు. ఆమె అపస్మారక స్థితిలో పడిపోయింది. ఇరుగుపొరుగు వారు కుమార్తెలకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి చూసేసరికి ఆమె మరణించింది. ఈ సమాచారం ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఇవ్వడంతో వన్‌టౌన్ సీఐ ఎస్.రాజశేఖర్, ఎస్ఐలు ఎస్.లక్ష్మణబాబు వారి సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఇరుగుపొరుగు వారి నుంచి వివరాలు తెలుసుకున్నారు. మరోవైపు కృష్ణవేణి కుమారుడు హరికృష్ణను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం బుధవారం పది గంటల ప్రాంతంలో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



కృష్ణవేణి మృతదేహం

అదుపు తప్పిన ట్రాక్టర్.. ఇద్దరికి గాయాలు

పెదపాడు, మే 1 :ట్రాక్టరు అదుపు తప్పి చెరువులో పడడంతో ట్రాక్టరుపై వున్న ఇద్దరు యువకులకు గాయాలపాలైనట్టు పెదపాడు ఎస్ఐ కె.శుభశేఖర్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం పెదపాడు మండలం రాజుపేటలో బుధవారం ఓ ట్రాక్టరు అదుపుతప్పి చెరువులో పడింది. ఆ సమయంలో ట్రాక్టరుపై కూర్చున్న తుంద్రురు లిఖిత ఆకాష్, గుండుబోయిన మణికంఠ పక్కకు దూకగా వారికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఏలూరు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. దీనిపై అప్పన కనకదుర్గప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చింతలపూడిని అభివృద్ధి చేస్తా..

» ఏలూరు ఎంపీ కూటమి అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్

కామవరపుకోట, మే 1: ప్రతిష్టాత్మకమైన ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపిస్తే చింతలపూడి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లోనూ అభివృద్ధి చేస్తామని ఏలూరు ఎంపీ కూటమి అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్ అన్నారు. బుధవారం కూటమి చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్‌తో కలసి కామవరపుకోట మండలంలోని పలుగ్రామాల్లో విస్తృత ప్రచారం చేశారు. మళ్లీ పొరపాటున జగన్ గెలిస్తే ప్రజల ఆస్తులకు రక్షణ ఉండదనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. ప్రచారంలో టీడీపీ నాయకులు గంటా మురళీరామకృష్ణ, జుజ్జూరి బాబ్జి, తూతా లక్ష్మణరావు, బేతిన వెంకట్రావు, కంఠమనేని అంజిమూర్తి, గోరింక దాసు, తదితరులు హాజరయ్యారు. ఈప్రచారం తడికలపూడి, సాగిపాడు, వీరంపాలెం, కళ్ళచెరువు, కె.ఎస్.రామవరం, గుంటుపల్లి గ్రామాల్లో జరిపారు,

ఆక్వా చెరువులకు నీటి చౌర్యాన్ని అడ్డుకోవాలి

గణపవరం, మే 1 : గణపవరం మండల గ్రామాల్లోని మంచినీటి చెరువులకు పూర్తిస్థాయిలో నీరు నింపుకునేందుకు ఆక్వా చెరువులకు నీటి చౌర్యానికి పాల్పడకుండా అడ్డుకోవాలని తహసీల్దార్ వై.రాంబాబు అధికారులను కోరారు. బుధవారం ఆర్డీవో ఆదేశాల ప్రకారం గ్రామ రెవెన్యూ అధికారులు, ఇరిగేషన్ అధికారులకు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. గణపవరం వెంకయ్య వయ్యేరు కాల్వల నుంచి ఉండి పంట కాల్వల నుంచి గ్రామ మంచినీటి చెరువులకు నీటిని తోడుకుంటున్నారని ఆక్వా యాజమానులు నీటి చౌర్యానికి పాల్పడితే చర్యలు తీసుకుటామని హెచ్చరించారు.

స్కానింగ్ సెంటర్లలో డీఎంహెచ్‌వో తనిఖీలు

ఏలూరు ఎడ్యుకేషన్, మే 1 : లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ సెంటర్ల యాజమాన్యాలపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట హెచ్చరించారు. బుధవారం నగరంలోని పలు స్కానింగ్ సెంటర్లు, డయాగ్నసిస్ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేసిన అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ రోగ నిర్ధారణ కేంద్రాలన్నీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం అగ్ని మాపకశాఖ నుంచి సేఫ్టీ సర్టిఫికెట్లు, ఎన్‌వోసీలు పొందాల్సిందేనని ఆదేశించారు. తనిఖీల్లో ఇన్‌చార్జి డెమో నాగరత్నం పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష వైద్యసేవలను వినియోగించుకోవాలి

ఏలూరు ఎడ్యుకేషన్, మే 1:నగరంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ప్రతీ బుధవారం నిర్వహించే ఆరోగ్యసురక్ష ఉచిత వైద్యసేవలను ప్రజలు వినియోగించుకోవాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ వి.చంద్రయ్య సూచించారు. పవర్‌పేట అర్బన్ హెల్త్ సెంటర్‌ను సందర్శించిన ఆయన ఆర్థోపెడిక్, జనరల్ మెడిసన్ వైద్యసేవలు ప్రజలకు అందుతున్నతీరుపై తనిఖీలు చేశారు. ఉచిత వైద్యసేవలపై మరింత విస్తృత ప్రచారం చేయాలని, ఎక్కువమంది వినియోగించుకునేలా చూడాలని కోరారు. రోగులతో ముఖాముఖీ మాట్లాడారు. ఆర్థో వైద్యనిపుణుడు డాక్టర్ లోకే.కృష్ణ, జనరల్ మెడిసన్ వైద్యుడు డాక్టర్ ఎం.సితాని, స్థానిక వైద్యాధికారి డాక్టర్ గౌతమ్, అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, వైద్య, మున్సిపల్ సిబ్బంది ఝాన్సీ శ్రీనివాసరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రచారంలో వలంటీరు.. విధుల నుంచి తొలగింపు

పోలవరం, మే 1 : పోలవరం మండలంలో గడిచిన నాలుగు రోజుల్లో వైసీపీ నామినేషన్, ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్న వాడపల్లికి చెందిన సున్నం పోశిని విధుల నుంచి తొలగించినట్టు ఎల్లండీపేట పంచాయతీ కార్యదర్శి పి.అప్పారావు తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి నందుకు విధుల నుంచి తొలగిస్తున్నట్టు ఎంపీడీవో ఇచ్చిన ఆదేశాల మేరకు తొలగించినట్టు తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఉంగుటూరు, మే 1:అర్హులైన ప్రతిఒక్కరూ పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఉంగుటూరు రిటర్నింగ్ అధికారి ఎన్.ఎస్.కే. ఖాజావలీ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి నారాయణపురం హైస్కూలులో ఈనెల 4,5వ తేదీలలో ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. సుమారు 1,500 మంది ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గోనె సంచుల సమస్య తీరుస్తాం

పెదవేగి, మే 1 :ధాన్యం సేకరణలో రైతులు ఎదుర్కొంటున్న గోనె సంచుల సమస్యను త్వరలోనే తీరుస్తామని జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌కే హబీబ్ బాషా తెలిపారు. కొప్పాక సొసైటీలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ధాన్యం తేమశాతం, నూక శాతాలను ఆయన పరిశీలించారు. ధాన్యం విక్రయంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. గోనె సంచుల కొరత ఉందని, త్వరలోనే ఆ కొరత తీరుతుందని అవసరమైనన్ని గోనెసంచులను అందిస్తామని హామీ ఇచ్చారు. ఏలూరు ఏడీఏ సుబ్బారావు, పెదవేగి ఏవో ఎం.ప్రియాంక, సొసైటీ కార్యదర్శి సీహెచ్.రమేష్, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌వన్నీ అబద్ధాలే..

జంగారెడ్డిగూడెం(బుట్టాయగూడెం), మే 1 :సీఎం జగన్ అబద్ధాలు ఆడుతున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టరు దాసరి శ్యామ్‌చంద్రశేషు అన్నారు. బుధవారం జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురంలో దళితుల కాలనీలో పునాదుల స్థాయిలోనే నిలిచిపోయిన ఇళ్లను సెల్ఫీలో చూపించి వీటిని పూర్తిచేసే దమ్ముందా అంటూ చాలెంజ్ చేశారు. మేనిఫెస్టోలో పెట్టిన హామీలను 99 శాతం అమలుపరచామని బహిరంగ సభల్లో చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కార్యక్రమంలో టి.వెంకటేశ్వరావు, ఆర్.శ్రీనివాస్ పాల్గొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో రానున్న 13 రోజులు అత్యంత కీలకమని బుధవారం జరిగిన సమావేశంలో టీడీపీ ఎన్నికల పరిశీలకులు పారేపల్లి రామారావు, దాసరి శ్యామ్‌చంద్రశేషు అన్నారు.

సమైక్య ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలి

జంగారెడ్డిగూడెం(బుట్టాయగూడెం), మే 1: సమైక్య ఉద్యమాలకు కార్మిక వర్గం సిద్ధంగా ఉండాలని ఇఫ్టూ రాష్ట్ర కోశాధికారి కేవీ రమణ పిలుపునిచ్చారు. బుధవారం జంగారెడ్డిగూడెం పట్టణంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. తాపీమేస్త్రీ ఆఫీసు వద్ద కె.వెంకటసూరిబాబు, బోసుబొమ్మ సెంటరులో మంచిలి రాజు, నాటు పొగాకు సంఘం ఆధ్వర్యంలో కె.సుబ్బారావు, సివిల్ సప్లై వద్ద కె.శ్రీను, ధర్మన్న స్మారక భవనం వద్ద బోనంగి చిన్నాబ్బాయి జెండాలను ఎగురవేశారు.

విస్తృతంగా ఎస్ఈబీ దాడులు

ఏలూరు క్రైం, మే 1 : జిల్లా వ్యాప్తంగా బుధవారం విస్తృతంగా ఎస్ఈబీ బృందాలు దాడులు నిర్వహించాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో సారా, మద్యం, గంజాయి, నగదు అక్రమ రవాణా జరుగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టారు. బుధవారం జిల్లాలోని చింతలపూడి, భీమడోలు, జంగా రెడ్డిగూడెం, నూజివీడు, పోలవరం, ఏలూరు, కైకలూరు ఎస్ఈబమీ పోలీస్ స్టేషన్ అధికారులు, చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది కలిసి నిర్వహించారు. సారా తయారీ, విక్రయదారులపై మూడు కేసులు నమోదులు చేసి వారి నుంచి 35 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. 1800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి కేసులు నమోదు చేశారు. డ్యూటీపెయిడ్ లిక్కర్ కల్గి ఉన్నవారిపై 11 కేసులు నమోదు చేసి 62.85 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నాన్ డ్యూటీపెయిడ్ మద్యం కల్గి ఉన్న ఇద్దరిపై కేసు నమోదు చేసి 16.56 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 17 కేసులలో 15 మంది వ్యక్తులను అరెస్టు చేశారు. మిగిలిన వారిని అరెస్టు చేయాల్సి ఉంది. ఏడు ప్రాంతాల్లో పది మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు తెలిపారు.



మద్యం స్వాధీనం చేసుకున్న ఎస్ఈబీ అధికారులు

వాహనాల తనిఖీలు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లజాము వరకు జిల్లాలోని అన్ని ప్రధాన ప్రాంతాల్లోనూ జాతీయ, రాష్ట్రీయ రహదారులపై తనిఖీలు నిర్వహించారు. పలు నగరాలు, పట్టణాలు, పలు ప్రాంతాల్లో ఏటీఎంలు, మసీదులను గస్తీ పోలీసులు పరిశీలన చేశారు. లాడ్జీలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలోని అనుమానాస్పద వ్యక్తులను పరిశీలించారు. జిల్లాలో నేరాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టారు.

నూజివీడు బరిలో..

స్వతంత్ర అభ్యర్థిగా బీజేపీ నాయకుడు


ఎ. ఇస్సాకు

నూజివీడు, మే 1: బీజేపీ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడు, ఎస్సీ నాయకుడు ఆముదాల ఇస్సాకు నూజివీడు అసెంబ్లీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి పోటీ చేస్తుండగా పొత్తు ధర్మానికి విరుద్ధంగా నూజివీడు బీజేపీ నాయకుడు స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగినా, జిల్లా, రాష్ట్ర పార్టీ ఈ అంశంపై దృష్టిసారించకపోవడం చర్చనీయాంశమైంది. పొత్తుధర్మం పాటించకపోవడానికి కారణం ఏమిటని ఆముదాల ఇస్సాకును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఆయన స్పందిస్తూ తాను 1991 నుంచి బీజేపీలో అనేక కీలక పదవుల్లో పనిచేస్తున్నానని, ప్రస్తుతం తాను పార్టీ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడిగా ఉన్నానన్నారు. నియోజకవర్గంలోని కొందరు అగ్రవర్ణనేతలు తన పట్ల చులకనగా వ్యవహరిస్తూ అవమానించారని, అందుకే తాను బరిలో నిలిచానన్నారు.


నూజివీడులో స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న ఎన్నికల పరిశీలకుడు రామన్

స్ట్రాంగ్ రూమ్ పరిశీలించిన ఎన్నికల పరిశీలకుడు

నూజివీడు, మే 1: స్ట్రాంగ్ రూమ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఎన్నికల పరిశీలకుడు ఎస్‌ఏ రామన్ పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా బుధవారం నూజివీడు నియోజకవర్గానికి సంబంధించి సారధి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను ఆయన పరిశీలించారు. నియోజకవర్గ కేంద్రాల వారీగా ఈవీఎంల కేటాయింపు, పోలింగ్ కేంద్రాలకు తరలించే ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల భద్రతా ఏర్పాటు, స్ట్రాంగ్ రూమ్ నుంచి పోలింగ్ కేంద్రాలకు తరలించే రూట్ మ్యాప్ తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని తగిన ఏర్పాట్లు చేయాలని, నూజివీడు ఆర్వో వై.భవానీ శంకరికి ఆయన సూచించారు. కేంద్ర ఎన్నికల మార్గదర్శకాల భద్రత అంశాలపై ఈ సందర్భంగా ఆయన క్షేత్రపరిశీలన చేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నూజివీడు టౌన్: నూజివీడు నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలను ఎన్నికల పరిశీలకులు ఎస్‌ఏ రామన్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలైన నూజివీడు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, గొల్లపల్లి జడ్పీ హైస్కూల్‌ను పరిశీలించి ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో నూజివీడు ఆర్వో భవానీశంకరి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ

ముదినేపల్లి, మే 1 : ఈ నెల 13న జరుగనున్న పోలింగ్‌కు ముదినేపల్లి మండలంలో ఓటర్లకు స్లిప్పులు పంపిణీ చేస్తున్నారు. మండలంలో సుమారు 49 వేల మంది ఓటర్లు ఉండగా, ఇప్పటి వరకు 50 శాతం స్లిప్పులను పంపిణీ చేసినట్లు తహసీల్దార్ ఎస్.ఎల్.నరసకుమారి తెలిపారు. నాలుగైదు రోజుల్లో నూరు శాతం స్లిప్పుల పంపిణీ చేయనున్నట్లు, గ్రామ సచివాలయాల సిబ్బంది ద్వారా ఈ స్లిప్పులను ఓటర్లకు అందజేస్తున్నట్లు తెలిపారు.

క్రైం వార్తలు

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

చాట్రాయి, మే 1: విస్సన్నపేట- చింతలపూడి రహదారిలో నాగిరెడ్డిగూడెం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని కోటపాడు గ్రామానికి చెందిన మోనూరి దుర్గారావు (30) మృతి చెందాడు. కోటపాడులో రైస్ మిల్లు డ్రైవర్‌గా పనిచేస్తున్న దుర్గారావు భార్యతో కలిసి ద్విచక్రవాహనంపై అంకంపాలెం బంధువుల ఇంటికి వెళ్ళి వస్తుండగా బైక్‌ని లారీ వెనుక నుంచి ఢీకొనటంతో దుర్గారావు అక్కడికక్కడే మృతి చెందగా, భార్య సురక్షితంగా బయటపడింది. దుర్గారావు మృతి సమాచారం తెలియగానే పెద్ద సంఖ్యలో గ్రామస్థులు, బంధువులు ప్రమాద స్థలానికి వచ్చారు. ఘటనా స్థలం చింతలపూడి మండల పరిధిలో ఉండటంతో అక్కడి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


రమణక్కపేట ఎస్సీకాలనీలో ఖాళీ బిందెలతో ఆందోళన

తాగునీరివ్వకుంటే..

ఎన్నికల బహిష్కారం

- రమణక్కపేట ఎస్సీ కాలనీ వాసుల హెచ్చరిక
- 10 రోజులుగా అల్లాడుతున్నామని ఖాళీ బిందెలతో ఆందోళన
- పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం

ముసునూరు, మే 1: మండలంలోని రమణక్కపేట ఎస్సీ కాలనీ వాసులు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. పది రోజులుగా తాగు నీరులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పంచాయతీ పాలకులు, అధికారులు సైతం పట్టించుకున్న దాఖలాలు లేవని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం మహిళలు ఖాళీ బిందెలతో ఆందోళన చేశారు. గుక్కెడు నీటి కోసం అలమటిస్తున్నా సర్పంచ్ కనీసం ఎస్సీ కాలనీ వైపు తొంగి చూడలేదని, కనీస మౌలిక సదుపాయాలను కూడా ఈ వైసీపీ ప్రభుత్వం కల్పించలేని దుస్థితిలో ఉందని వారు ప్రభుత్వం, పాలకుల పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. కనీసం ట్యాంకర్ల ద్వారా కూడా నీటి సరఫరా లేయడం లేదని, ఒక్క ట్యాంక్ నీటిని వందలాది రూపాయలతో కొనుగోలు చేసి నీటి అవసరాలు తీర్చుకుంటున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు వార్డుల్లో సుమా రు 400 కుటుంబాలు ఉన్న ఈ ఎస్సీ కాలనీపై సర్పంచ్ వివక్ష చూపుతున్నాడని, ఎస్సీ లంటే అంత చులకనా అని వారు మండిపడ్డారు. ఇప్పటికైనా తాగునీటి సమస్యలను పరిష్కరించకపోతే నూజివీడు ఆర్డీవో కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తామని మహిళలు హెచ్చరించారు.

ఎన్నికలు బహిష్కరిస్తాం...



గత పది రోజులుగా కాలనీలో తాగునీరు రాక నానా ఇబ్బందులు పడుతున్నాం. వాడుకనీరు కోసం వ్యవసాయ బోర్లు వద్దకు కిలోమీటర్ల దూరం వెళ్ళి తెచ్చుకోవాల్సిన పరిస్థితి. ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే ఎన్నికలను బహిష్కరిస్తాం.

- ఆముదాల శిరీష, ఎస్సీ కాలనీ వాసి, రమణక్కపేట

ట్యాంకు నీరు రూ. 600



ప్రతి వేసవిలోను ఎస్సీ కాలనీలో ఇదే పరిస్థితి నెలకొన్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. తాగునీరు కోసం ఇటీవల ఎన్నికల ప్రచారానికి వచ్చిన స్థానిక ఎమ్మెల్యేను అడ్డుకున్నాం. అయినా సమస్య తీరలేదు. రూ. 600లకు ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసుకుంటున్నాం.

- నందిపాము సత్యరాజు, వార్డు సభ్యుడు, రమణక్కపేట.

సమస్య పరిష్కరిస్తాం..

రమణక్కపేట ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య ఉంది. కాలనీకి నీటి సరఫరా చేసే బోరును కొన్ని అడుగులు లోతు తీయించి, మోటారును బిగించి చూస్తాం. అయినా నీటి సామర్థ్యం పెరగకపోతే 3 రోజుల్లో కొత్త బోరు వేస్తాం. అప్పటి వరకు ట్యాంకర్లతో నీటిని అందిస్తాం.

-వై.ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి, రమణక్కపేట


కైకలూరులో ప్రచారం నిర్వహిస్తున్న కూటమి అభ్యర్థి కామినేని


మణుగులూరు నుంచి కూటమిలో చేరిన వారికి కామినేని అభినందన

పేదల నివాసాలు తొలగించం : కామినేని

కైకలూరు, మే 1: కైకలూరులో కాలువగట్ల వెంబడి నివాసం ఉంటున్న పేదల ఇళ్లను తొలగించనని కైకలూరు అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ హామీ ఇచ్చారు. బుధవారం కైకలూరు ఇస్లాంపేట, వెలమపేట, కోరుకొల్లురోడ్డు, ఏలూరురోడ్డులోని జగనన్న కాలనీల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు తన సొంత ప్రయోజనాల కోసం కాలువగట్ల వెంబడి నివసిస్తున్న వారి ఇళ్లు తొలగించారని, ఆయనకు ఓటు వేస్తే పేదల ఇళ్లు కూల్చివేస్తారన్నారు. ఆయా నివాస గృహాల ప్రజలు విజ్ఞతతో ఆలోచించి మంచి వ్యక్తులకు ఓట్లు వేసి గెలిపించుకోవాలని సూచించారు. తనను ఎన్నికల్లో గెలిపిస్తే ఆ గృహాల ప్రజలకు ఎలాంటి హాని చేయనని, ఇచ్చిన హామీని నెరవేర్చుకునే సమర్థత తన వద్ద ఉందని ప్రజలు అవగాహన చేసుకోవాలన్నారు. కైకలూరు పట్టణంలో ప్రజలు స్వేచ్ఛతో జీవించేలా చేస్తానని, తనను గెలిపిస్తే రౌడీలకు, దందాలకు చోటుండదన్నారు. తనకు కమలం గుర్తుపై, ఎంపీ అభ్యర్థికి సైకిల్ గుర్తుకు ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కూటమి నాయకులు నర్సిపల్లి అప్పారావు, ఎండీ జానీ, ఎండీ ఉస్మాన్, సయ్యద్ బషీద్, షేక్ షావుద్దీన్, షేక్ ఆరిఫ్, షేక్ నజీర్, షేక్ సుబానీ, బంకపల్లి భాస్కరరావు, తెంటు నాగేశ్వరరావు, డోకల శ్రీనివాసరావు, వేగిరెడ్డి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లేటి లంక గ్రామాల్లో వైసీపీకి భారీ షాక్

మండవల్లి: మండవల్లి మండలంలో వైసీపీ నుంచి వలసలు జోరందుకున్నాయి. అధికార పార్టీలో జడ్పీటీసీ స్థాయి నుంచి సర్పంచ్, ఎంపీటీసీ పదవులు పొందిన నాయకులు సైతం వైసీపీకి బాయ్ చెప్పి కామినేని చెంతకు చేరుతున్నారు. బుధవారం మణుగులూరు గ్రామ మాజీ సర్పంచ్ జంగం సుగుణరావు, నాయకులు మొగనాటి మెకాయేలు, గుండాబత్తిన నాని, మొగనాటి మోషే, మొగనాటి సుందర్‌సింగ్, గజ్జల థామస్, మొగనాటి కృపారావు, వరిగంజి రాజారత్నం, నత్త సామేలు, దేవాదాసు వరం, మొగనాటి లోకేష్, పెనుకొండ తంబి, యోబు, కిరణ్, యేసేపు, గాలి యోహాను, గోవాడ సుబ్బయ్య, దానియేలు, ఒరగించి అమృతరావు, దానియేలు రాజేష్, యోనా, షడ్రాక్, గ్రామ నాయకుల ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో వైసీపీని వీడి కైకలూరు నియోజకవర్గ అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ సమక్షంలో ఎన్డీయే కూటమిలో చేరగా వారిని సాదరంగా కూటమిలోకి ఆహ్వానించారు. అలాగే చింతపాడు సర్పంచ్ ఘంటసాల భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ జయమంగళ లక్ష్మి, నాయకులు జయమంగళ వీర్రాజు, ఘంటసాల విష్ణు, మాజీ సర్పంచ్ ఘంటసాల విష్ణుమూర్తి, సైదు వెంకన్నబాబు గ్రామ నాయకులు భారీ సంఖ్యలో వైసీపీని వీడి కామినేని సమక్షంలో కూటమిలో చేరారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కైకలూరు ఎమ్మెల్యే, అతని కుమారులు చేసే దుర్మార్గాలు భరించలేక వైసీపీని వీడి కూటమిలోకి తరలివస్తున్నారన్నారు.

మరో షాక్.. కలిదిండి వైస్ ఎంపీపీ చేరిక

కలిదిండి: కలిదిండిలో వైసీపీకి షాక్ తగిలింది. కలిదిండి వైస్ ఎంపీపీ కట్టా నాగలక్ష్మి, ఆమె భర్త పాండురంగారావు తమ స్వగ్రామమైన గొల్లగూడెంలో కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్ సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.




రక్తదానం చేస్తున్న దృశ్యం

రక్తదాన శిబిరం

కలిదిండి, మే 1 : కలిదిండి ఏఎంసీలో బుధవారం హోప్ ఛారిటబుల్ ట్రస్ట్ 4వ వార్షికోత్సవం సందర్భంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని డాక్టర్ కె.ఆర్.కె. వర్మ, డాక్టర్ త్రివేణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహ కులు మాట్లాడుతూ తలసేమియా బాధితులకు 102 మంది యువత రక్తదానం చేయటానికి ముందుకు రావటం అభినందనీయమన్నారు. ఇప్పటి వర కు ఉభయ రాష్ట్రాల్లో ట్రస్ట్ ద్వారా 15 వేల మంది నుంచి రక్తాన్ని సేకరిం చామని, వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఆనంద్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

4న అగ్నికుల క్షత్రియుల ఆత్మీయ సమావేశం



కలిదిండి, మే 1 : కలిదిండిలో ఈ నెల 4న నిర్వహించే నియోజకవర్గ అగ్నికుల క్షత్రియుల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంద్రాజు శ్రీనివాస్, ఫిషర్‌మెన్ కో-ఆపరేటివ్ అధ్యక్షుడు సంగాని గంగాధరరావు పిలుపునిచ్చారు. బుధవారం కలిదిండిలో టీడీపీ మండల అధ్యక్షులు పోకల జోగిరాజుతో కలసి అగ్నికుల ఆత్మీయ సమావేశపు ఆహ్వాన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అగ్నికుల క్షత్రియ ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర హాజరవుతున్నారని, నియోజకవర్గంలో అగ్ని కుల క్షత్రియుల పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. అగ్నికుల క్షత్రియ సంఘ నాయకులు కొల్లాటి సత్యనారాయణ, మోకా వెంకటేశ్వరరావు, వాటాల దశరథ, కొల్లాటి గోపాలరాజు, తిరుమాని గోపాలకృష్ణ, వడుగు గోపాలరావు, కొల్లాటి దుర్గారావు పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలభిషేకం



ముదినేపల్లి, మే 1 : ప్రజోపయోగకరమైన మేనిఫెస్టోను ఎన్డీఏ కూటమి విడుదల చేయటంపై హర్షం వ్యక్తం చేస్తూ బుధ వారం ముదినేపల్లిలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. టీడీపీ పోల్ మేనేజ్‌మెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, డాక్టర్ కామినేని శ్రీనివాస్ తనయుడు వేణుగోపాల్, నాయకులు లింగమనేని భాను ప్రసాద్, పలువురు బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

మానవత చలివేంద్రం ఏర్పాటు



కైకలూరు, మే 1: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలి వేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కైకలూరు అధ్యక్షుడు కొండ్రెడ్డి వెంకట సత్యనా రాయణ అన్నారు. బుధవారం కైకలూరు ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా, ఏలూరు రోడ్డు సెంటర్లో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రాలను ప్రారంభించారు. మానవత సభ్యులు వడ్లాని శ్రీరామచంద్రమూర్తి, చింతపల్లి జయప్రకాష్, చేకూరి బాలాజీ, గుర్రం శ్యాం కుమార్, బెల్లాని శ్యామలరావు, తలారి వేణుగోపాల్, కాట్రగడ్డ నాని, సయమంతుల గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



ముదినేపల్లి, రమణక్కపేటలో మేడే వేడుకలు


కలిదిండిలో పతాకాన్ని ఆవిష్కరించి సీఐటీయూ నేతల నినాదాలు


ఆగిరిపల్లి మండలంలో వేడుకలు


చనుబండ మేడే వేడుకల్లో మాట్లాడుతున్న మోరంపూడి


కైకలూరులో ముఠా కార్మికులతో మేడే వేడుకల్లో పాల్గొన్న కామినేని

ఘనంగా మేడే వేడుకలు

కైకలూరు, మే 1: కార్మికుల సంక్షేమానికి, వారికి ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు అందించడానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని కైకలూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. బుధవారం మేడే సందర్భంగా కైకలూరు గాంధీబొమ్మ సెంటర్లో శ్రీ శ్యామలా ముఠా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం సీఎన్నార్ గార్డెన్‌లో కార్మిక, రైతు కూలీ సంఘాలతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికుల జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో భవన నిర్మాణ కార్మికులను దెబ్బతీశాడని, ఇసుక అందుబాటులో లేకుండా చేసి పేదలకు పని కల్పించడంలో విఫలమయ్యాడన్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో ఇసుకను ఉచితంగా అందజేశారని, ప్రస్తుతం ఇసుక ధర బంగారంతో పోటీపడుతోందన్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో నాసిరకం మద్యాన్ని విక్రయించడంతో కల్తీ మద్యం తాగి 30 వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోయిన ఘటన కూలీలకు గుర్తు చేశారు. కార్మికులకు అండగా చంద్రన్న బీమా ఉండేదని చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే ఈ బీమాను పునః ప్రారంభిస్తారన్నారు. కార్మికులంతా ఏకతాటిపై ఉండి జగన్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతులు, కార్మికులు, కూలీలకు ఆర్థిక భరోసాతో పాటు కుటుంబ సంక్షేమం జరుగుతుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, నర్సిపల్లి అప్పారావు, డాక్టర్ సీఎల్ వెంకట్రావు, విజయలక్ష్మి, పూల రామచంద్రరావు, డోకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: ముదినేపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. యూనియన్ మండల అధ్యక్షురాలు సూరపనేని అరుణ కుమారి మేడే జెండా ఎగురవేశారు. యూనియన్ కార్యదర్శులు బండి పద్మ, సొంగా మణి, సీఐటీయూ మండల కన్వీనర్ మాధవ్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

కలిదిండి: కలిదిండిలో సీఐటీయూ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అరుణ పతాకాన్ని ఆవిష్కరించి కార్మికుల ఐక్యత వర్థిల్లాలి అంటూ నినాదాలు చేశారు. మిఠాయిలు పంచారు. అనంతరం భవన నిర్మాణ కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో కలిదిండి సెంటర్ నుంచి ఏఎంసీ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న రాజకీయ పార్టీలకు ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. సీఐటీయూ నాయకులు అబిదా బేగం, చిన్నం శ్రీకాంత్, రామకృష్ణ, భవన నిర్మాణ కార్మికుల యూనియన్ మండల అధ్యక్షుడు పోతురాజు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు టి.గణపతి ప్రసాద్, ఎస్.దాస్, నరసింహ, రిక్షా వర్కర్స్ యూనియన్ నాయకులు నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వి.భాస్కరరావు, పి.జ్ఞానేషు, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: మేడేను ఆగిరిపల్లి, నెక్కలం గొల్లగూడెం గ్రామాల్లో శ్రామికులు ఘనంగా జరుపుకున్నారు. వెట్టిచాకిరి నుంచి విముక్తులను చేసి 8 గంటల పనిదినాన్ని సాధించిన రోజే మేడే అని సీపీఎం నాయకుడు సత్తు కోటేశ్వరరావు అన్నారు. ఆగిరిపల్లిలో ఐదు స్థూపాల వద్ద, నెక్కలంలో నాలుగు స్థూపాల వద్ద ఈ మేడే వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మండల కార్యదర్శి శివనాగరాజు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

ముసునూరు: రమణక్కపేటలో ఏఐసీసీటీయూ జిల్లా కార్యదర్శి వేముల బక్కయ్య ఉపాధి కార్మికులతో కలసి ఎర్రజెండాను ఆవిష్కరించి, అమర వీరులకు నివాళులర్పించారు. కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే యత్నాలను ప్రభుత్వాలు మానుకుని, కార్మిక హక్కులు కాపాడాలని బక్కయ్య కోరారు. అలాగే చింతలవల్లి, చెక్కపల్లి, గోపవరం, ముసు నూరు తదితర గ్రామాల ప్రధాన కూడళ్ళలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయ కులు, భవన నిర్మాణ కార్మికుల యూనియన్ నాయకులు, సీపీఎం, సీపీఐ నాయకులు సంయుక్తంగా ఎర్రజెండాను ఆవిష్కరించి, మిఠాయిలను పంపిణీ చేశారు.

చాట్రాయి: చాట్రాయి, చనుబండ, జనార్దనవరం తదితర గ్రామాల్లో రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, భవన నిర్మాణ సంఘం నాయకుడు తీర్థాల అద్భుతరావు మేడే విశిష్టతను వివరించారు. చిన్నంపేటలో ఉపాధి పని ప్రదేశంలో మేడే వేడుకలు నిర్వహించి, 200 మంది కూలీలకు మాజీ వైస్ ఎంపీపీ పరసా వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు కొమ్ము ఆనందం మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

సీఎం వచ్చారుగా..

నరకం చూసిన ఏలూరు ప్రజలు

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పర్యటనతో బుధవారం ఏలూరు ప్రజలు నరకం చూశారు. అసలే మండుతున్న ఎండలు. ఆపై ప్రధాన రహదారులు మూసి వేయడంతో జనం ఎటు వెళ్లాలో తెలియక నానా అవస్థలు పడ్డారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి, కోర్టు ఉన్న ప్రధాన రహదారి పైనే రోడ్‌షో ఉండడంతో ఉదయం 11 గంటల నుంచే పోలీసులు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ప్రభుత్వాసుపత్రికి వెళ్ళేవారు కూడా నరకయాతన పడ్డారు. నగరానికి వచ్చే బస్సులు కూడా వేరే మార్గాల్లో పంపించారు. వ్యాపారులు షాపులను మూసుకోవాల్సి వచ్చింది. ద్విచక్ర వాహనాలు, కార్లతో ఆసుపత్రిలో హారన్స్ వేసుకుంటూ చక్కెర్లు కొట్టారు. రోగులకు తీవ్ర ఇబ్బందులు కలిగించారు. వైసీపీ కార్యకర్తలు ఆకతాయిలుగా మారారు. వాటర్ ప్యాకెట్లను చింపి ఆ నీళ్ళను మహిళలపై చిమ్మారు. జేబుదొంగలు జనం పర్సులు,సెల్‌ఫోన్లు కొట్టేశారు. ఆర్‌ఆర్ పేటలో పార్కింగ్ చేసిన ఒక మోటారు సైకిల్‌ను కూడా ఎత్తుకు పోవడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన ముగిసిన సాయంత్రం 6 గంటల వరకూ నగరంలోని ప్రజలు నరకయాతన చూడాల్సి వచ్చింది. - ఏలూరు క్రైం


బస్సులన్నీ బయటే.. బస్టాండ్ ఖాళీ..

పోలీసుల అధీనంలో నగరం

ఆసుపత్రికి వెళ్లే దారి బంద్


ఆర్‌ఆర్‌పేట వెళ్ళే ప్రధాన రహదారిని మూసివేసిన దృశ్యం

ప్రజల అవస్థలు

సీఎం సభకోసం విద్యుత్ స్తంభం కట్ చేశారు..